ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 145, పేజీలు - 08

శుక్రవారం, నవంబర్ 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్

- సంక్షేమ పథకాల్లో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం వాటా - మద్దిమడుగులో రూ.38 కోట్లతో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

- మరో రూ.71 కోట్లతో మూడు అభివృద్ధి పనులకు శ్రీకారం - డిండి ప్రాజెక్టు నుంచి నీళ్లిచ్చే బాధ్యత మాదే: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని బంజారాలు, ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గిరిజన, ఆదివాసీ వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకునే సంక్షేమ పథకాల్లో వారికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగులో రూ.38 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. మద్దిమడుగుకు చేరుకున్న ముఖ్యమంత్రి తొలుత శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం రూ.71 కోట్లతో చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణంతో పాటు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో రూ.15 కోట్లతో నిర్మించనున్న హరిత హోటల్ భవనానికి, రూ.18 కోట్లతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

2లో..



మీకు చేతగాక వ్యవస్థలపై

ఆరోపణలా.?

- రాహుల్పై అమిత్ షా ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేవలం రాజకీయాల కోసమే రాజ్యాంగాన్ని వాడుకుంటున్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విమర్శించారు. రాజ్యాంగ సంస్థలను, ఎన్నికల ప్రక్రియను హేళన చేస్తున్నారని ఆరోపించారు. దిల్లీలో జరిగిన 'సంవిధాన్ గౌరవ్ దివస్' కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. రాజ్యాంగం అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటును ఏర్పాటు చేసింది చర్చల కోసమేనని, కానీ రాహుల్ మాత్రం వీధుల్లో చర్చలు జరపాలంటున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, ఆయన ఫారిన్ టూర్లు మానేసి దేశంలో సమస్యలను అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టాలని అన్నారు.అలాగే ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాహుల్

2లో..

మహిళా సాధికారతే

నా సంకల్పం

- అందుకోసమే తెలంగాణ రుద్రమ సేన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా 'మహిళలు – రాజ్యాంగం' పేరిట నిర్వహించిన సదస్సులో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సంప్రదాయ పద్ధతిలో పగిడీలు ధరించి సదర్ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో మహిళల హక్కులు, ఆర్థిక స్వాతంత్ర్యంపై కల్వకుంట్ల కవిత సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రసంగం ఆరంభంలోనే కవిత మహాభారతంలోని ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టాన్ని గుర్తు చేశారు. అప్పుడు ద్రౌపది ప్రశ్నించిన ప్రశ్నలకు ఈ నాటికీ సమాధానం దొరకలేదని

2లో..



మూడేళ్ల క్రితం అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ నాటకమాడారు

రాహుల్ గాంధీపై 'ఎక్స్' వేదికగా కేటీఆర్ విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాహుల్ గాంధీజీ

2లో..

తిరుమల శ్రీవారికి 121 కిలోల

బంగారు ఆభరణాలు విరాళం

- చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త వర్ధమాన్ జైన్ భారీ కానుక - విరాళం విలువ సుమారు రూ. 206 కోట్లుగా అంచనా

- ఆభరణాల అప్పగింత కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) తిరుమల శ్రీవారి సన్నిధిలో అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైంది. సీఎం చంద్రబాబు సమక్షంలో చెన్నైకు చెందిన జైన్ దంపతులు శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాలను (41 రకాలు) విరాళంగా సమర్పించారు. వీటి విలువ సుమారు రూ. 206 కోట్లు ఉంటుందని, బంగారు ఆభరణాలతో పాటు విలువైన వజ్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. టీటీడీ అర్చకులు, ప్రతినిధులు ఈ ఆభరణాలను శాస్త్రోక్తంగా స్వీకరించారు. వర్ధమాన్ జైన్ 2025 జనవరి 19న స్వామి వారికి రూ.6 కోట్లు, మే 16న ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందజేశారు. దాతలు వర్ధమాన్ జైన్, రాధికా జైన్‌తో కలిసి సీఎం చంద్రబాబు తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించారు. 106 కేజీలతో శ్రీవారికి, 15 కేజీలతో పద్మావతి అమ్మవారికి స్వర్ణ వస్త్రం తయారు చేశారు.



రూ.206 కోట్లు విరాళంగా ఒక భక్తుడు ఇవ్వడం ఒక చరిత్ర. భక్తి, విశ్వాసంతో ముందుకొచ్చి విరాళమిచ్చారు. తరాలు మారినా శ్రీవారిపై భక్తి, విశ్వాసం కొనసాగుతూనే ఉన్నాయి. పాద కవచాలు, కౌస్తుభం, నాగాభరణాలు చాలా బాగా వచ్చాయి. వజ్రాలు, రత్నాలతో ఆభరణాలను బ్రహ్మాండంగా డిజైన్ చేశారని' చంద్రబాబు వెల్లడించారు.దేశంలో ఎక్కడా లేని పచ్చదనం తిరుమలలో ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలో

2లో..

రాయలసీమ లిఫ్ట్ స్కీం

కొత్త ప్రాజెక్టు కాదు

- సీఎం చంద్రబాబు మౌనం ఎందుకు.?



అమరావతి (ప్రశ్న న్యూస్) రాయలసీమ లిఫ్ట్ స్కీంపై తెలంగాణ రాజకీయ పార్టీల విమర్శలతో వాస్తవాలను తెలియడంలేదని వైసీపీ అధినేత జగన్ అన్నారు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన సీఎం చంద్రబాబు, కాంగ్రెస్‌తో ఉన్న రాజకీయ కారణాలతో మౌనంగా ఉన్నారని విమర్శించారు.

రాయలసీమ లిఫ్ట్ స్కీం.. కొత్త ప్రాజెక్టు కాదు!

"వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రాయలసీమ లిఫ్ట్ స్కీం ఏమాత్రం కొత్త ప్రాజెక్టు కాదు. ఈ ప్రాజెక్టులో అదనపు నీటి కేటాయింపులు, కొత్త కాల్వలు, అదనపు రిజర్వాయర్లు లేదా అదనపు ఆయకట్టు ఏవీ లేవు. అదే కృష్ణానది, అవే నీళ్లు, అవే కేటాయింపులు, అదే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి పాత కాల్వల ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించిన జలాలను సమర్థవంతంగా వినియో గించు కునేందుకు ఏర్పాటు చేసిన ఒక ఇన్సూరెన్స్ స్కీం లాంటిదే. పోతిరెడ్డిపాడు ద్వారా శ్రీశైలం నుంచి పూర్తిస్థాయిలో (44,000 క్యూసెక్కులు) నీళు పారాలంటే శ్రీశైలంలో నీటి మట్టం కనీసం 880 అడుగుల పైన ఉండాలని, 854 అడుగుల దిగువకు పడిపోతే అసలు నీళ్లే పంపలేని పరిస్థితి ఉందని వైఎస్ జగన్ అన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులు

కృష్ణానది ద్వారా ఏపీకి వచ్చే నీళ్లు తగ్గుతున్న నేపథ్యంలో, వచ్చిన నీటిని కూడా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో దిగువకు వదిలేయడం మరో సమస్యగా మారిందని వైఎస్ జగన్ అన్నారు. మరోవైపు శ్రీశైలంలో 800 అడుగుల నుంచే నీటిని తీసుకునేందుకు తెలంగాణ పలు ప్రాజెక్టుల ద్వారా రోజుకు సుమారు 3 టీఎంసీల సామర్థ్యంతో ముందుకు వెళ్తోందని ఆరోపించారు.

2లో..

రాజ్యాంగ పరిరక్షణ కోసమే సంవిధాన్ రక్షా మార్చ్

- మోదీ ముఠా దాడిని తిప్పికొట్టేందుకే ర్యాలీ అన్న సీఎం రేవంత్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మోదీ ముఠా రాజ్యాంగంపై చేస్తున్న దాడిని తిప్పికొట్టేందుకే సంవిధాన్ రక్షా ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మోదీ ముఠా నుంచి రాజ్యాంగాన్ని రక్షించేందుకే తామందరం పనిచేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంపై కుట్ర జరుగుతోందని, ఆ దాడి నుంచి కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. అహింసతోనే యుద్ధం గెలవవచ్చని మహాత్మా గాంధీ నిరూపించారని సీఎం గుర్తు చేశారు. తాము పాలకులం కాదు, ప్రజాసేవకులమని అన్నారు. ప్రజలు నియమించుకునే ప్రజాసేవకులమని పునరుద్ఘాటించారు. నియంత పాలకులు ఉండలో? ప్రజల కోసం పోరాడే వారు ఉండాలో? ప్రజలే నిర్ణయించాలని అన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని గాంధీ, నెహ్రూ, పటేల్, అంబేద్కర్లు రాజ్యాంగం అందించారని, కొందరు అధికారం శాశ్వతం చేసుకోవాలని రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని బీజేపీని ఉద్దేశించి రేవంత్ రెడ్డి విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం

2లో..



హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్

- ఐటీ కారిడార్‌లో వన్‌వే, బస్సులకు స్పెషల్ లైన్

- ఐటీ కంపెనీల పనివేళలను మార్చాలని సూచన

- డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ సరికొత్త చర్యలపై దృష్టి సారించాయి. సైబరాబాద్ ప్రాంతంలో వన్‌వే విధానాలు, బస్సులకు ప్రత్యేక లేన్లు తీసుకొచ్చే ప్రతిపాదనలను డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రజలు, ఐటీ సంస్థలు పోలీసులకు సహకరించాలని కోరారు. గురువారం నిర్వహించిన 'సైబరాబాద్ మూవ్స్-2026' సదస్సులో డీజీపీ సీవీ ఆనంద్

2లో..

పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మేడ్చల్ కోర్టు సమన్లు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి జరుగుతున్న విచారణలో భాగంగా ఆయన స్వయంగా కోర్టుకు హాజరు కావాలని స్పష్టం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. జనవరి 28న న్యాయస్థానం ఎదుట హాజరు కావాలని ఆదేశించడంతో ఈ కేసు ట్రయల్ ప్రక్రియలో కీలక ముందడుగు పడింది.17 ఏళ్ల మైనర్ బాలికను వేధించడంతో పాటు బలవంతంగా మద్యం తాగించి, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని బాధితురాలి తల్లి చేసిన ఫిర్యాదు ఆధారంగా మే నెలలో పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో

2లో..

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

సంక్షేమ పథకాల్లో గిరిజనులకు పెద్దపీట

ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దాదాపు 45 శాతం ఇళ్లను ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, లంబాడా, ఆదివాసీ కుటుంబాలు అత్యధికంగా లబ్ధి పొందుతున్నాయని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు కూడా గిరిజన, ఆదివాసీ వర్గాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకునే అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి దేశ సేవలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నదే ప్రభుత్వ ఆకాంక్షగా పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం

లంబాడీల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆదర్శమూర్తి అని సీఎం కొనియాడారు. శాంతియుత జీవనం గడపాలని, హింసకు దూరంగా ఉండాలని, మాంసాహారం, మద్యపానానికి దూరంగా ఉంటూ పేదలకు సేవ చేయాలని ఆయన బోధించారని గుర్తుచేశారు. సమాజానికి ఆదర్శంగా నిలవాలన్న సేవాలాల్ మహారాజ్ సందేశం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలన్న సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1976లో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని గుర్తుచేశారు. ఎస్టీ రిజర్వేషన్ల ఫలితంగా నేడు లంబాడీ వర్గానికి చెందిన వారు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా, ప్రజాప్రతినిధులుగా ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి స్థాయికి కూడా ఎదిగారని వివరించారు.

గిరిజనులకు భూముల పంపిణీలో ఇందిరాగాంధీ కృషి

భూమిలేని గిరిజనులు, వలసలపై ఆధారపడే కుటుంబాలకు అసైన్మెంట్ పట్టాలు, పోడు భూముల పట్టాలు అందించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఇందిరాగాంధీ హయాంలో గిరిజనులకు 10 నుంచి 12 లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే భూమి, విద్య, ఉపాధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

నల్లమల బిడ్డగా గర్వపడుతున్నా

తన స్వగ్రామం కొండారెడ్డిపల్లి అని, అచ్చంపేట ప్రాంతం నల్లమల బిడ్డగా చెప్పుకోవడం తనకు ఎంతో గర్వకారణమని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంత ప్రజలు కష్టపడే తత్వం, పోరాడి నిలబడే నైజం కలిగి ఉంటారని ప్రశంసించారు. మాట ఇస్తే మట్టిలో కలిసైనా నిలబెట్టుకునే లక్షణం ఈ ప్రాంత ప్రజల నుంచే నేర్చుకున్నానని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి మరో నాలుగు ఎకరాలు

ప్రస్తుతం 16 ఎకరాల్లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, మరో నాలుగు ఎకరాల భూమిని కూడా సేకరించి ఆలయాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అచ్చంపేట ప్రాంతంలో బ్రిడ్జి, లిఫ్ట్ పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర అభివృద్ధి పనులను కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు. డిండి ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంతానికి సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర సిలారపు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే సంవిధాన్ రక్షా మార్చ్

సాధించాలని, సమాన అవకాశాలను అందించాలని 1885లో కాంగ్రెస్ ఏర్పడిందన్న ఆయన ఎందరో తమ ప్రాణ త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని మనకు అందించారని గుర్తు చేశారు.

ఇప్పుడు ఓట్ల తొలగింపు ద్వారా కుట్ర

బీజేపీ నాయకులు గతంలో పేదలు, మహిళలకు ఓటు హక్కు వద్దని వాదించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ మాత్రం అందరికీ ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. కుల, మత బేధాలు, తప్పుడు హామీలతో రెండో సారి, మూడోసారి అధికారంలోకి మోదీ వచ్చారని ఇప్పుడు ఓట్ల తొలగింపు ద్వారా నాలుగోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని మండిపడ్డారు. మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ దుష్ట చతుష్టయం కలిసి దేశంపై కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలకు చెందిన 13 కోట్ల ఓట్లు తొలగించారన్న సీఎం మరో 7 కోట్ల ఓట్ల తొలగింపునకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 90 ఎమ్మెల్యే, 15 ఎంపీ సీట్లను గెలిపించాలన్నారు. అంతకుముందు ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డు ఇందిరా గాంధీ విగ్రహం వరకు సంవిధాన రక్షామార్చ్ భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర చేశారు. టీపీసీ చీఫ్, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మేల్యేలు పాల్గొన్నారు.

జేబు సంస్థలుగా వాడుకుంటున్నారు

బీజేపీ ఎన్ని కౌంటర్ ర్యాలీలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వెంటే ఉంటారని టీపీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ర్యాలీలకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ కౌంటర్ ర్యాలీలు నిర్వహిస్తోందని కరీంనగర్లో నితిన్ నబీన్ చేసిన యాత్రనుద్దేశించి విమర్శించారు. మోదీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని ఆరోపించిన ఆయన సీబీఐ, ఈడీతో పాటు ఎన్నికల కమిషన్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకుందని విమర్శించారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని ఓట్ల తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు.

రాజ్యాంగం కోసం పోరాడుతాం

భారత రాజ్యాంగంలో మత స్వేచ్ఛను కూడా పొందపరిచారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గుర్తుచేశారు. నాడు న్యాయశాఖ మంత్రి పదవికి కూడా అంబేద్కర్ రాజీనామా చేశారని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని స్పష్టం చేశారు.

లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరం



జయశంకర్ భూపాలపల్లి. లింగ నిర్ధారణ పరీక్ష చట్టరీత్యా నేరమని పరీక్ష చేయించిన వారు, చేసిన వారు,ప్రోత్సహించిన వారు,శిక్షార్హులు అవుతారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ స్పష్టం చేశారు.జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 13 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని ఇందులో ఐదు ప్రభుత్వాధీనంలో 8 ప్రైవేట్ సెంటర్లో పనిచేస్తున్నాయని తెలిపారు, లింగ నిర్ధారణ పరీక్షల నిరోధంపై దృష్టి పెట్టాలన్నారు. పరీక్షలు చేయకూడదని లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు అలా చేసిన చేయించి ప్రోత్సహించిన వారికి మూడేళ్ళు జైలు శిక్షతోపాటు రూపాయలు 50 వేల జరిమానా విధిస్తారని ఆచరించారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రచన గైనకాలజిస్టు, డాక్టర్ రాజేష్ పీడియాట్రిషన్, సోషల్ వర్కర్లు, డెమో శ్రీదేవి మొదలగు వారు పాల్గొన్నారు.

మీకు చేతగాక వ్యవస్థలపై ఆరోపణలా.?

వ్యవహరిస్తున్నారని, ఎస్ఐఆర్ తోపాటు మొత్తం ఎన్నికల ప్రక్రియపైనే అపనమ్మకం కలిగిస్తున్నారని అమిత్ షా ధ్వజమెత్తారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించటానికి బీజేపీ కట్టుబడి ఉందని అమిత్ షా స్పష్టం చేశారు. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని తేల్చిచెప్పారు. అలాగే మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో 18 నెలలపాటు ఎమర్జెన్సీ పాలనను విధించిన విషయాన్ని గుర్తుచేస్తూ కాంగ్రెస్పై మండిపడ్డారు. 'యూసీసీ-ఉమ్మడి పౌర స్మృతి అనేది మన రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాల్లో చేర్చిన అంశం. ఈ దేశంలోని ప్రతి పౌరుడికి మతానికి అతీతంగా ఒకే చట్టం కింద జీవించే హక్కు లభించాలి. వారు హిందువు అయినా, సిక్కు అయినా, ముస్లిం అయినా, క్రైస్తవులైనా లేదా పార్సీ అయినా సరే. దేశం కామన్ సివిల్ కోడ్ అంటే యూసీసీ ప్రకారమే నడవాలన్నది బీజేపీ ఆవిర్భావం నుంచీ డిమాండ్ చేస్తోంది. చట్టాలు మతం ఆధారంగా రూపొందించకూడదు. రాహుల్ దీనిని మీ పార్టీ పూర్తిగా తిరస్కరిస్తోంది. కానీ నేను స్పష్టంగా చెప్పడానికి వచ్చాను. రాబోయే రోజుల్లో బీజేపీ పాలిత ప్రభుత్వాలు ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ మేం యూసీసీని అమలు చేయబోతున్నాం' అని అమిత్ షా పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాలు విరాళం

అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని చెప్పారు. ఐదు వేల దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దేవాలయం నిర్మించిన ప్రతిచోటా అన్నప్రసాదం ఉంటుందని వెల్లడించారు. మరోవైపు శ్రీవారిని రోజు 121 కిలోల బంగారు ఆభరణాలతో అలంకరిస్తారని అందుకే అంత మొత్తంలో ఆభరణాలను విరాళంగా అందజేసినట్లు పారిశ్రామిక వేత్త వర్ధమాన్ జైన్ తెలిపారు."తిరుమల శ్రీవారి వైభవం మాటల్లో చెప్పలేనిది. తిరుమల అంటే భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మిక ఆనందం. ఎక్కడా దొరకని దివ్యానుభూతి తిరుమలలో దొరుకుతుంది. తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారు ఆభరణాలు ఒక భక్తుడు విరాళమిచ్చారు. ఈ మహత్తర ఘట్టంలో నేను భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు.అంతకుముందు తిరుమల శ్రీవారిని సీఎం చంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు. తొలుత ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అర్చకులు సీఎం దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని చంద్రబాబు, భువనేశ్వరి దర్శించుకున్నారు. రంగనాయకుల మండలంలో వారికి అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు ఆభరణాలు చెన్నైకి చెందిన పారిశ్రామిక వేత్త వర్ధమాన్ జైన్ ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా టీటీడీకి అందజేశారు.

మూడేళ్ల క్రితం అశోక్‌నగర్‌లో రాహుల్ గాంధీ నాటకమాడారు

మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో మీరు ఒక నాటకానికి తెరలేపారు. నాటకీయ లైటింగ్ మధ్య ఇరానీ చాయ్ తాగుతూ, ఫొటోలకు పోజులిస్తూ, ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించారు. మూడేళ్ల తర్వాత అసలు నిజం బయటపడింది. రెండు లక్షల ఉద్యోగాలు ఒక మిథ్య. యువ వికాసం ఒక మిరాజ్. మీ జాబ్ క్యాలెండర్ తెలంగాణ యువత నమ్మకాన్ని అపహాస్యం చేసేలా ఉంది. ఉద్యోగాలు కల్పించడం అంటే ఫొటోషూట్ కాదు. చాయ్ తాగుతూ చేసే పబ్లిసిటీ స్టంట్ అంతకంటే కాదు. ఉద్యోగాలు కల్పించాలంటే దార్శనికత ఉండాలి. కనీసం ఒక్క ఉద్యోగం కల్పించాలన్నా అచంచలమైన నిబద్ధత ఉండాలి" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల హామీని అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఈ ప్రాంత యువత, ఇప్పుడు తమకు రావాల్సిన ఉద్యోగాల హక్కుల కోసం కూడా అదే రీతిలో పోరాడుతుందని అన్నారు.

మహిళా సాధికారతే నా సంకల్పం

తీవ్ర భావోద్వేగంతో తన ప్రసంగం నిర్వహించారు. ఆనాడు నిండు సభలో దుశ్శాసనుడు వచ్చి 'నీ భర్త నిన్ను ఓడిపోయాడు, నువ్వు మా ఆస్తివి' అన్నప్పుడు ద్రౌపది ఒకే ఒక్క ప్రశ్న అడిగిందని కవిత గుర్తు చేశారు.. 'మొదట ఆయన తనను తాను పందెం పెట్టుకుని ఓడిపోయారా.. లేక నన్ను పందెం పెట్టి ఓడిపోయారా.? ఆయన ముందే ఓడిపోయి మీకు బానిసైతే, నాపై ఆయనకు హక్కు ఎక్కడిది.? ఒకవేళ నన్నే మొదట పందెం పెట్టారంటే.. నేనేమైనా గొర్రెనా.? బర్రెనా.? భూమినా.? బిల్డింగా.? నన్ను ఎలా పందెం పెడతారు.?' అని నిలదీసిందని ప్రశ్నించారు. ఆనాడు ద్రౌపది అడిగిన ఆ ప్రశ్నకు భారతదేశంలో ఏ ఒక్కరూ ఇంతవరకు సమాధానం చెప్పలేకపోయారు అని కవిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.వేల ఏళ్లుగా సమాజంలో మహిళలను ఒక స్వతంత్ర వ్యక్తిగా కాకుండా ఒక ఆస్తిలాగే చూస్తున్నారని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పుట్టింట్లో ఉన్నంత కాలం తండ్రి, అన్నల ఆస్తిగా వివాహమైన తర్వాత భర్త, అత్తమామల కుటుంబానికి చెందిన ఆస్తిగా మహిళల జీవితం మారిపోయిందని అన్నారు.

మహిళలకు సొంత ఆలోచనలు, చిన్నచిన్న ఇష్టాఇష్టాలు ఉండాలన్నా ఇంటి పెద్దల అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి నేటికీ కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆధునిక కాలంలోనూ మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక అస్వతంత్రతపై కవిత కీలక విషయాలను ప్రస్తావించారు.ఎంతోమంది తల్లులు, ఆడబిడ్డలు తన వద్దకు వచ్చి వారి బాధలను చెప్పుకుంటారని కవిత తెలిపారు. తాము కష్టపడి ఉద్యోగం చేసి జీతం సంపాదిస్తున్నా బ్యాంక్ అకౌంట్ కంట్రోల్ మాత్రం తమ భర్త దగ్గరో, తండ్రి దగ్గరో ఉంటోంది అని చెబుతున్నారని పేర్కొన్నారు. మహిళలు సంపాదించిన డబ్బును ఏం చేయాలి, ఎలా ఖర్చు పెట్టాలో కూడా తండ్రులు, అన్నలు, భర్తలే నిర్ణయించే పరిస్థితి ఈ రోజుకీ ఉంది అని కవిత తెలిపారు. రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పటికీ ఆచరణలో ఆర్థిక స్వేచ్ఛ, నిర్ణయాధికారం పూర్తిస్థాయిలో దక్కినప్పుడే నిజమైన పండుగ జరుపుకోగలమని ఆమె పిలుపునిచ్చారు. పగిడీలు కట్టుకుని, ఆత్మగౌరవంతో మహిళలంతా ముందుకు సాగాలని ఈ సందర్భంగా కవిత ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక స్వతంత్రత గురించి కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చకు దారి తీశాయి.

రాయలసీమ లిఫ్ట్ స్కీం కొత్త ప్రాజెక్టు కాదు

1. పాలమూరు-రంగారెడ్డి ద్వారా రోజుకు 1.5 టీఎంసీలు
2. డిండి ద్వారా రోజుకు 0.5 టీఎంసీలు
3. కల్వకుర్తి ద్వారా రోజుకు 0.4 టీఎంసీలు
4. ఎస్ఎల్‌బీసీ ద్వారా రోజుకు 0.5 టీఎంసీలు

ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తీసుకోలేని సమయంలో, నీటిని లిఫ్ట్ చేసి అదే పోతిరెడ్డిపాడు కాల్వలోకి ఎత్తిపోసి పాత రిజర్వాయర్లకు చేరవేయడమే రాయలసీమ లిఫ్ట్ స్కీం ప్రధాన ఉద్దేశమని వైఎస్ జగన్ అన్నారు. నీటి కేటాయింపులు ఉన్నా వినియోగించుకునే అవకాశం లేకపోతే వాటికి సార్థకత ఏముంటుందని ప్రశ్నించారు.

పనులు ఆపేయడంపై విమర్శలు

దాదాపు పూర్తైన రాయలసీమ లిఫ్ట్ స్కీం పనులను చంద్రబాబు అధికారంలోకి రాగానే నిలిపివేశారని వైఎస్ జగన్ విమర్శించారు. ఈ స్కీమ్ ఆవశ్యకతను బలంగా చెప్పాల్సింది పోయి, రాజకీయ కారణాలతో పనులను ఆపి రాయలసీమ ప్రజల తాగు, సాగునీటి అవసరాలకు నష్టం కలిగించారని ఆరోపించారు. ఎవరికీ నష్టం కలిగించని ఈ పథకంపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.

పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మేజ్చల్ కోర్టు సమన్లు

కేసు నమోదైంది. ఈ క్రమంలో పోలీసులు మే 16న బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. ఆయనపై పోక్సో చట్టంలోని నిబంధనలతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఆధారాలను ధ్వంసం చేయడం తదితర సంబంధిత సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు.

ఎదాదాపు 50 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న బండి భగీరథ్‌కు, జూలై నెలలో కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ మేజ్చల్ పోక్సో కోర్టులో నడుస్తుండటంతో, తదుపరి న్యాయ ప్రక్రియ కోసం ఆయన వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావడం తప్పనిసరిగా మారింది. జనవరి 28న జరిగే విచారణలో కేసు తదుపరి దశకు చేరుకోనుంది.

హైదరాబాద్ ట్రాఫిక్‌కు చెక్

ఈ వ్యాఖ్యలు చేశారు. సైబరాబాద్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో వాహనాల రద్దీని నియంత్రించేందుకు జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ఉన్న తరహాలో పన్‌వే లూప్‌లు ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు.వీటితోపాటు కీలక సిగ్నళ్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూటర్న్‌లను క్రమబద్ధీకరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని మరింత మెరుగ్గా మెయింటైన్ చేయవచ్చని పోలీస్ బాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసం ప్రత్యేక క్యారేజ్ వే, బస్సుల కోసం కౌంటర్‌ఫ్లో బస్ లేన్లను పరిశీలించాలని సూచించారు. ఈ మార్పులను అమలు చేసే సమయంలో మొదటి రెండు, మూడు రోజులు ప్రజల నుంచి విమర్శలు, అసౌకర్యంపై ఫిర్యాదులు రావచ్చని, వాటికి భయపడకుండా అధికారులు ధైర్యంగా ముందుకు వెళ్లాలని పోలీసు సిబ్బందికి సూచించారు.గత 20 ఏళ్లలో సైబరాబాద్ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందిందని డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేశారు. ప్రస్తుతం ఐటీ కారిడార్ ప్రాంతంలో సుమారు 10 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో దాదాపు 80 శాతం మంది తమ పర్సనల్ వెహికల్స్‌లోనే ఆఫీసులకు వస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఐటీ కారిడార్‌లో వాహనాల సంఖ్య పెరిగి ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతోందని వివరించారు. అదే సమయంలో అన్ని ఐటీ కంపెనీలకు ఒకే సమయంలో ఉద్యోగుల పనివేళలు ఉండటం కూడా భారీగా ట్రాఫిక్ రద్దీకి ఒక కారణమని డీజీపీ అభిప్రాయం వెల్లడించారు. ఈ క్రమంలోనే ఆయా కంపెనీలు తమ ఉద్యోగుల పనివేళలను వేర్వేరుగా నిర్ణయించే అంశాన్ని పరిశీలించాలని హితవు పలికారు. ఉద్యోగులు సొంత కార్లలో రావడాన్ని హోదాకు చిహ్నంగా భావించకుండా ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు.సైబరాబాద్ ప్రాంతంలో రహదారుల అనుసంధానం సరిగా లేకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యంగా వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రంగా మారుతోందని.. ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయి నరకం అనుభవిస్తున్నారని చెప్పారు. మియాపూర్ పరిసరాల్లో రోడ్ల విస్తరణ చేపట్టాలని, ఐటీ కంపెనీల భాగస్వామ్యంతో ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మెట్రో రైలు విస్తరణ, ఎంఎంటీఎస్, ఆర్టీసీ బస్సు సేవలను మెరుగుపరిస్తేనే ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ద్వారా సుమారు 10 లక్షల మంది ఐటీ ఉద్యోగులకు ప్రజా రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు.సైబరాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సీఎంసీ, సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా 'సైబరాబాద్ మూవ్స్-2026' సదస్సును నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. లండన్ ట్రాన్స్‌పోర్ట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ శశి వర్మ, బొగోటా మాజీ మేయర్ ఎన్రిక్ పెనలోసా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సైబరాబాద్ సీపీ రమేష్‌తో పాటు ఐటీ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు వివిధ సంస్థలు అమలు చేస్తున్న విధానాలను అతిథులతో కలిసి డీజీపీ సీవీ ఆనంద్ పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా ప్రధాన కూడళ్ల అభివృద్ధి కోసం సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, లివింగ్ ల్యాబ్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరం మరో బెంగళూరులా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కోకూడదంటే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధమైన మార్పులు అవసరమని డీజీపీ అభిప్రాయపడ్డారు. ఈ ప్రయత్నాల్లో ప్రభుత్వ శాఖలతోపాటు ఐటీ కంపెనీలు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డా. బి.ఆర్. అంబేడ్కర్ కు ఘన నివాళి



కరీంనగర్ భారత రాజ్యాంగం ఆమోదించబడిన చారిత్రాత్మక దినం (26 నవంబర్ 1949) 'భారత రాజ్యాంగ దినోత్సవం' సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గల రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డా. బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్ ప్రస్తుత నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవలను, భారత ప్రజాస్వామ్యానికి ఆయన అందించిన మహోన్నత రాజ్యాంగ విలువలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు ఒంటెల సత్యనారాయణరెడ్డి, సరిల్లా ప్రసాద్, బుచ్చిరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని డా. బి.ఆర్. అంబేడ్కర్ కు శ్రద్ధాంజలి ఘటించారు.

డప్పు చాటింపుతో దీక్షా దివస్‌కు ఆహ్వానం

- నవంబర్ 29న అలుగునూరులో భారీ సభ.. కేటీఆర్ హాజరు

కరీంనగర్ కరీంనగర్ నవంబర్ 29న అలుగునూరులో జరిగే దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్‌లో డప్పు చాటింపు నిర్వహించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్వయంగా డప్పు కొట్టి ప్రజలను సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. 2009 నవంబర్ 29 తెలంగాణ చరిత్రలో కీలక మలుపని, కేసీఆర్ ఆమరణ దీక్షే రాష్ట్ర సాధనకు పునాది వేసిందని అన్నారు. దీక్షా దివస్ కేవలం బీఆర్ఎస్ కార్యక్రమం కాదని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల చారిత్రక సందర్భమని పేర్కొన్నారు. 29న మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులను సన్మానిస్తామని తెలిపారు. ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రామాయంపేటలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని మెదక్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుజన సంఘాల నాయకులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బహుజన నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు స్వేచ్ఛ సమానత్వం సోదరభావం కల్పించిందని తెలిపారు.రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి. ఆర్.అం

తూర్పు గోదావరి జిల్లాలో
బైక్‌ను ఢీకొట్టిన రెండు కార్లు

- ప్రమాద ధాటికి సుమారు 100 మీటర్లు గాల్లోకి ఎగిరిపడ్డ యువకుడు
- స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడటంతో ఆశ్చర్యం
- పెట్రోల్ బంక్ సీసీటీవీలో రికార్డైన ప్రమాద దృశ్యాలు వైరల్
- కిందపడిన కొద్దిసేపటికే లేచి తన బైక్‌ను తీసుకుని వెళ్లిపోయిన బాధితుడు



తూర్పు గోదావరి జిల్లా: తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన ఓ వింత రోడ్డు ప్రమాదం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రెండు కార్లు ఒకదాని తర్వాత ఒకటి ఢీకొట్టడంతో ఓ బైకర్ సుమారు 100 మీటర్ల దూరం గాల్లోకి ఎగిరిపడ్డాడు. కానీ అద్భుతమనేలా, అతడు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ఈ షాకింగ్ ఘటన సమీపంలోని సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. రంగంపేట మండలం పెదరాయవరం సమీపంలోని ఏడీబీ రోడ్డుపై ఈ సంఘటన జరిగింది. కాకినాడ జిల్లా పెద్దాపురం వద్ద ఓ రొయ్యల ఫీడ్ తయారీ యూనిట్‌లో పనిచేసే సామర్లకోట నివాసి సాలిక నవీన్, అనారోగ్యం కారణంగా సెలవు తీసుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. పెదరాయవరంలోని తన అత్తగారింట్లో ఉంటున్న నవీన్, ఓ మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న రెండు కార్లు వేగంగా ఢీకొట్టాయి. మొదటి కారు ఢీకొట్టిన వెంటనే నవీన్ అదుపుతప్పి గాల్లోకి లేచాడు. అదే సమయంలో రెండో కారు కూడా బలంగా ఢీకొట్టడంతో, ఆ ధాటికి దాదాపు 100 మీటర్ల దూరం గాల్లో పల్టీలు కొడుతూ కిందపడ్డాడు. ఈ భీకర ప్రమాదాన్ని చూసిన స్థానికులు, అతడికి తీవ్ర గాయాలై ఉంటాయని లేదా ప్రాణాలే పోయి ఉంటాయని భావించారు. కానీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ, కిందపడిన కొద్దిసేపటికే నవీన్ లేచి నిలబడ్డాడు. తన దెబ్బతిన్న బైక్‌ను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ మొత్తం దృశ్యం సమీపంలోని పెట్రోల్ బంక్‌లో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అయింది. సాధారణంగా ఇలాంటి ప్రమాదాల్లో తీవ్ర గాయాలు లేదా మరణాలు సంభవిస్తుంటాయి. కానీ నవీన్ స్వల్ప గాయాలతో బయటపడటం నిజంగా అద్భుతమని, దేవుడి దయ వల్లే బతికాడని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అధికారికంగా పోలీసుల నుంచి ఎటువంటి ప్రకటన రానప్పటికీ, వైరల్ అవుతున్న వీడియో మాత్రం అందరినీ నివ్వెరపరుస్తోంది

బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ రెడ్డిపై
కాంగ్రెస్ నాయకుల హత్యాయత్నం



కొల్లాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ గుండాల అరచాకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లి గ్రామ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు కన్నా రెడ్డి భాస్కర్ రెడ్డి పై గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు దుండగులు కంట్లో కారం చల్లి కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన భాస్కర్ రెడ్డిని రోడ్డుపై వస్తున్న కొందరు గమనించి గ్రామస్తుకు సమాచారం అందించారు. వెంటనే అతన్ని 108 వాహనంలో నాగర్కర్నూల్ జిల్లా కేంద్రానికి తరలించారు. తీగలపల్లి గ్రామానికి చెందిన కురువ పెద్ద బిచ్చయ్య, తెలుగు బాల చంద్రయ్య, తెలుగు వీరభద్రయ్య, తెలుగు ఆంజనేయులు అనే వ్యక్తులు భాస్కర్ రెడ్డి గురువారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో వాకింగ్ చేస్తుండగా దారి కాచి కంట్లో కారం చల్లి కర్రలతో దాడి చేశారు. రక్తం మడుగులో పడి ఉన్న భాస్కర్ రెడ్డి చనిపోయాడని భావించిన దుండగులు చెట్ల పొదల్లో భాస్కర్ రెడ్డిని పడేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం భాస్కర్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..
– స్పాట్ లోనే నలుగురు మృతి



అనంతపురం యాడికి మండలం రాయలచెరువు సమీపంలో ఆగి ఉన్న లారీని తుఫాన్ వాహనం ఢీకొన్నది. హైదరాబాద్ నుంచి తాడిపత్రి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో తాడిపత్రి రూరల్ మండలం కావేటి సముద్రం గ్రామానికి చెందిన ఇద్దరు వున్నారు. తాడిపత్రి పట్టణానికి చెందిన మల్లికార్జున, ఆయన భార్య మృతి చెందారు. మరో ఇద్దరు వీరాంజనేయులు రెడ్డి, హనుమంత్ రెడ్డి అలియాస్ చిన్నబాబు. తుఫాన్ డ్రైవర్ కిరణ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దళిత అభ్యర్థులకు అవమానం

అన్నమయ్య అన్నమయ్య జిల్లాలో దళిత అభ్యర్థులను పోలీసులు అడ్డుకున్నారు. సంబేపల్లి మండలంలో దళిత మహిళ అభ్యర్థులను, ఏజెంట్లను పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. పోలీసులు వారిని బలవంతంగా జీపు ఎక్కించుకొని తీసుకెళ్లారు. రౌతుకుంటలో తమ అభ్యర్థి కనిపించకుండా పోయాడని గ్రామస్తులు సిఐను నిలదీసారు. విలేఖరులు వీడియో చిత్రీకరిస్తుండగా ఫోను లాక్కున్నారు. పోలీసుల తీరు పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేసారు

బెంగళూరులో వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి

- బెంగళూరు సమీపంలో షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహం
- రఘురామి రెడ్డితో క్రిస్టియన్ పద్ధతిలో జరిగిన పెళ్లి వేడుక
- వేడుకకు హాజరైన కుటుంబ సభ్యులు



బెంగళూరు : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, బ్రదర్ అనిల్ కుమార్ దంపతుల కుమార్తె వైఎస్ అంజలీ రెడ్డి వివాహం డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డితో ఘనంగా జరిగింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో బుధవారం ఇరు కుటుంబాల అత్యంత సన్నిహితులు, బంధుమిత్రుల సమక్షంలో ప్రైవేట్ వేడుకగా ఈ వివాహ క్రతువు పూర్తయింది. కాగా, ఈ శుభకార్యానికి షర్మిల సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయనకు అత్యంత సన్నిహితంగా ఉండే బంధువులు కూడా దూరంగా ఉన్నారు.తొలుత క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం జరిగింది. ఇరు కుటుంబాల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ గురువారం సాయంత్రం సాంప్రదాయ హిందూ పద్ధతిలో మరోసారి వివాహ వేడుకను నిర్వహించనున్నారు. అనంతరం కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ జిల్లా నంది హిల్స్ సమీపంలో ఉన్న 'ఓరా ఆకాశం' రిసార్ట్‌లో గురువారం సాయంత్రం వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు పలువురు ప్రముఖులు, సీనియర్ రాజకీయ నాయకులు, కుటుంబ శ్రేయోభిలాషులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపనున్నారు. వైఎస్ అంజలీ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మనవరాలు కాగా, వరుడు డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డి.. సోమల సుబ్బా రెడ్డి, సోమల పద్మా రెడ్డి దంపతుల కుమారుడు. తమ కుమార్తె వివాహం గురించి వైఎస్ షర్మిల సెప్టెంబర్ నెలలోనే అధికారికంగా ప్రకటించారు. పెళ్లి పనుల ప్రారంభంలో భాగంగా ఇరు కుటుంబాల పెద్దలు వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించి, వైఎస్సార్ సమాధి వద్ద తొలి వివాహ పత్రికను ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.ప్రధాన వివాహానికి ముందు ఇరు కుటుంబాల ఆధ్వర్యంలో హల్దీ సహా పలు ప్రీ-వెడ్డింగ్ వేడుకలు ఉల్లాసంగా సాగాయి. ఈ సంబరాలకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకున్నాయి. కుమార్తె వివాహ మహోత్సవానికి రావాల్సిందిగా వైఎస్ షర్మిల స్వయంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ప్రస్తుతం కర్ణాటకలో జరుగుతున్న వివాహ కార్యక్రమాలను కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులకే పరిమితం చేశారు. అయితే, రాజకీయ, సినీ, వ్యాపార రంగాల ప్రముఖుల కోసం డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో వెడ్డింగ్ రిసెప్షన్ ఏర్పాటు చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు.

పది లక్షల సభ్యులు.. ఒక సంఖ్య కాదు, ఒక నమ్మకం!

తిరుపతి : దేశంలోని ప్రతి పార్టీకి డిజిటల్ వేదికలు, మొబైల్ యాప్‌లు ఉన్నాయి. అగ్రనాయకుల ప్రసంగాలు, పార్టీ ప్రకటనలను కింది స్థాయికి చేరవేసేలా ఈ డిజిటల్ మాధ్యమాలను ఉపయోగిస్తుంటారు. దాదాపు ప్రతిపార్టీ ఇదే విధానం అనుసరిస్తుండగా, టీడీపీ మాత్రం భిన్నమైన పంథాను అనుసరిస్తూ డిజిటల్ టెక్నాలజీలో సరికొత్త పుంతలు తొక్కుతోందని విశ్లేషిస్తున్నారు. ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కునే లక్ష్యంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దూరదృష్టితో అభివృద్ధి చేసిన మైటీడీపీ యాప్ ఇప్పుడు ఆ పార్టీకి బలమైన సైన్యాన్ని తయారు చేసిందని అంటున్నారు. కార్యకర్త నుంచి అధినేత వరకు ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా అనుసంధానం కల్పించే ఒక సమగ్ర డిజిటల్ వ్యవస్థగా మైటీడీపీ యాప్ ను అభివృద్ధి చేసి టీడీపీ సరికొత్త రికార్డులు నమోదు చేసిందని అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఖీఊ) ద్వారా ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించిన అనుభవంతో, పార్టీలోనూ అదే తరహా వేగవంతమైన స్పందన ఉండేలా లోకేశ్ మై టీడీపీ యాప్‌ను తీర్చిదిద్దినట్లు చెబుతున్నారు. దీని ద్వారా పార్టీ అధినేత సందేశాలు, నాయకత్వ సూచనలు క్షణాల్లో 10 లక్షల మంది కార్యకర్తలకు చేరడంతో పాటు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, స్థానిక సమస్యలు నేరుగా పార్టీ అధిష్ఠానానికి చేరుతున్నాయి. పార్టీ తీసుకునే నిర్ణయాలు, కార్యక్రమాల రూపకల్పనలో కార్యకర్తల స్పందనను ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాకుండా, వారి విలువైన సూచనలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఈ వేదికను రూపొందించారు. తద్వారా పార్టీ విధాన నిర్ణయాల్లో సామాన్య కార్యకర్త కూడా భాగస్వామి అయ్యే అవకాశం లభించింది.నాయకుల ప్రసంగాలతో పార్టీలు బలోపేతం కావు.. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల శ్రమ, వారి నిబద్ధత, వారి అభిప్రాయాలకు ఇచ్చే విలువతోనే బలమైన రాజకీయ వ్యవస్థ నిర్మాణమవుతుంది. ఈ సూత్రాన్ని ఆచరణలోకి తీసుకొచ్చే ప్రయత్నంలో తెలుగుదేశం పార్టీ మరో కీలక మైలురాయిని చేరుకుంది. పార్టీకి, కార్యకర్తలకు మధ్య డిజిటల్ వారధిగా ప్రారంభించిన 'మైటీడీపీ' యాప్‌లో సభ్యుల సంఖ్య పది లక్షలకు చేరడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.రాజకీయ పార్టీల విజయాల్లో నాయకుల పాత్ర ఎంత ముఖ్యమో.. కార్యకర్తల పాత్ర అంతకంటే కీలకం. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరగడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోసుకెళ్లడం.. ఇలా కార్యకర్తలు చేసే కృషి వెలకట్టలేనిది. అయితే చాలాసార్లు పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు, అవకాశాలు దక్కడం లేదనే అసంతృప్తి కనిపిస్తుంటుంది.ఈ పరిస్థితిని మార్చాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 'మైటీడీపీ' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. పార్టీకి, కార్యకర్తలకు మధ్య కేవలం సమాచార సంబంధమే కాకుండా.. వారి అభిప్రాయాలు, సూచనలు, క్షేత్రస్థాయి అనుభవాలకు కూడా ప్రాధాన్యత కల్పించడమే ఈ డిజిటల్ వేదిక వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా ఆయన పేర్కొంటున్నారు.మైటీడీపీ యాప్‌లో సభ్యుల సంఖ్య పది లక్షలకు చేరుకోవడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సందర్భంగా నారా లోకేష్ సంతోషం వ్యక్తం చేస్తూ.. కార్యకర్తే నాయకుడని, కార్యకర్తే పార్టీకి బలమని పేర్కొన్నారు.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఒక్కరి కృషిని గుర్తించాలని, ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువ ఇవ్వాలని, కష్టపడే వారికి తగిన అవకాశాలు కల్పించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్యంతోనే మైటీడీపీ యాప్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఈ ప్రయాణంలో భాగమైన పది లక్షల మంది తెలుగుదేశం కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ప్రస్తుత రాజకీయాల్లో సోషల్ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. గతంలో పార్టీ అధిష్ఠానానికి కార్యకర్తలు తమ సమస్యలు, అభిప్రాయాలు చేరవేయాలంటే అనేక మార్గాలు దాటాల్సి వచ్చేది. కానీ డిజిటల్ వేదికలు అందుబాటులోకి రావడంతో ఈ దూరాన్ని తగ్గించే అవకాశం ఏర్పడింది.మైటీడీపీ వంటి వేదికల ద్వారా పార్టీ శ్రేణులను ఒకే వ్యవస్థలోకి తీసుకురావడం, వారి భాగస్వామ్యాన్ని పెంచడం, క్షేత్రస్థాయి కార్యకలాపాలకు గుర్తింపు కల్పించడం వంటి లక్ష్యాలను సాధించవచ్చు. అయితే ఈ వేదిక అసలు విజయవంతం కావాలంటే యాప్‌లో సభ్యుల సంఖ్య పెరగడమే కాకుండా.. కార్యకర్తల సమస్యలకు స్పందించడం, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవడం, అర్హులకు అవకాశాలు కల్పించడం కూడా అంతే ముఖ్యం.పది లక్షల మంది సభ్యులు చేరడం ఒక మైలురాయి మాత్రమే. ఆ పది లక్షల గొంతుకలకు పార్టీలో ఎంత ప్రాధాన్యత లభిస్తుందన్నదే అసలైన పరీక్ష. పార్టీ కోసం పనిచేసే సామాన్య కార్యకర్తకు నాయకత్వంతో నేరుగా అనుసంధానం కల్పించగలిగితే.. అది రాజకీయాల్లో ఒక కొత్త విధానానికి నాంది కావచ్చు.నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు.. కింది స్థాయిలో పనిచేసే వారి శ్రమను గుర్తించడం కూడా. కార్యకర్తల అభిప్రాయాలను వినడం, వారి సామర్థ్యానికి తగిన బాధ్యతలు అప్పగించడం ద్వారా పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం కావచ్చు. మైటీడీపీ యాప్ పది లక్షల సభ్యుల మైలురాయిని చేరడం టీడీపీకి డిజిటల్ పరంగా ఒక ముఖ్యమైన ముందడుగు. కానీ నారా లోకేష్ చెబుతున్నట్లుగా కార్యకర్తే నాయకుడనే భావనను క్షేత్రస్థాయిలోనూ నిజం చేయగలిగితే.. ఈ యాప్ కేవలం సభ్యత్వ నమోదు వేదికగా కాకుండా, కార్యకర్తల సాధికారతకు ఒక వేదికగా నిలిచే అవకాశం ఉంది. ఎందుకంటే పార్టీని నిర్మించేది నాయకత్వం అయితే.. ఆ పార్టీకి పునాది వేసేది కార్యకర్తే!

రాజమండ్రికి 'మహా కుంభమేళా' వైభవం



రాజమండ్రి : గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వచ్చే ఏడాది జూన్ 26న మొదలయ్యే పుష్కరాలు జులై 7వ తేదీ వరకు జరగనున్నాయి. మరో ఏడు నెలల్లో ప్రారంభమయ్యే ఈ మహా క్రతువును అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం భారీగా నిధులు సమకూర్చింది. పుష్కరాల కోసం రూ.904 కోట్లు, రాజమండ్రి నగరంలో రోడ్లు, వంతెన అభివృద్ధి కోసం మరో రూ.456 కోట్లు విడుదల చేశారు. అదేవిధంగా ఆర్ అండ్ బీ పరిధిలో పనుల కోసం రూ.678 కోట్లతో వివిధ రకాల పనులు చేస్తున్నారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే గోదావరి పుష్కరాలను ఈ సారి మహా కుంభమేళా తరహాలో నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం అనేక జాగ్రత్తలు తీసుకుంటోందని చెబుతున్నారు. ప్రధాని మోదీకి ఆహ్వానం మహా గోదావరి పుష్కరాలకు ప్రధాని మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీలైతే ప్రధాని మోదీ చేతుల మీదుగా పుష్కర సంబరం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికార వర్గాలను ఆదేశించారని అంటున్నారు. ఇప్పటికే ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు చర్చించారని అంటున్నారు. అయితే అప్పటి పరిస్థితులను బట్టి ప్రధాని కార్యక్రమం నిర్ణయిస్తారని చెబుతున్నారు. ప్రతి 12 ఏళ్లకు జరిగే పుష్కరాలను మూడు సార్లు నిర్వహించే అరుదైన అవకాశం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వచ్చిందని అంటున్నారు. గతంలో 2003, 2015ల్లో గోదావరి పుష్కరాలు జరిగాయి. అప్పట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన నేతృత్వంలోనే పుష్కరాలు నిర్వహించే అరుదైన అవకాశం మరోసారి వచ్చిందని అంటున్నారు. దీంతో ఈ సారి కనీవినీ ఎరుగని రీతిలో పుష్కరాలకు ఏర్పాట్లు చేసి చరిత్రలో చెరగని ముద్ర వేయాలని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు.గోదావరి పుష్కరాలను దక్షిణ భారత్ కుంభమేళాగా పిలుస్తారు. ఎంతో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశిష్టత ఉన్న వేడుకను అత్యద్భుతంగా నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ముఖ్యంగా వసతి సమస్య నివారణకు కుంభమేళాలో నిర్మించిన టెంట్ సిటీ తరహాలో రాజమండ్రిలో కూడా భారీ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా పుష్కరాలకు దాదాపు 8 నుంచి పది కోట్ల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. ప్రతి రోజు కనీసం 75 లక్షల మంది పుష్కర స్నానాలు చేస్తారని భావిస్తున్నారు. దీంతో భక్తులకు వసతి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. గోదావరి పరిసర ప్రాంతాల్లో ప్రధాన ఆలయాలతోపాటు లంక గ్రామాల్లో భారీ ఎత్తున టెంట్ సిటీలను నిర్మించాలని భావిస్తోంది. రాజమండ్రి సమీపంలోని పిచ్చుకలంకతోపాటు 21 ప్రధాన ఆలయాల పక్కన ఈ టెంట్ సిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భక్తులు కేవలం పుష్కర స్నానం చేసి వెళ్లిపోకుండా, కనీసం 2 నుండి 3 రోజులు అక్కడే బస చేసి పరిసర ప్రాంతాలను సందర్శించేలా ఈ విడిది కేంద్రాలను తీర్చిదిద్దుతున్నారు. ఇక టెంట్ సిటీలకు అదనంగా, గోదావరి జిల్లాల్లో సంప్రదాయ ఇళ్లను ఎంపిక చేసి 'హోమ్ స్టే' విధానం ద్వారా 50 వేల గదులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఏఐతో రద్దీ నివారణ ఇక పుష్కరాలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని నిర్ణయించింది. ముఖ్యంగా రద్దీ సమయాల్లో తొక్కిసలాట ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు నిరంతరం సీసీ కెమెరాల ద్వారా ఏఐ నిఘా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న 440 పుష్కర ఘాట్ల వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఉపయోగించాలని నిర్ణయించారు. దీనిద్వారా ఘాట్ల వద్ద యాత్రికులు ప్రవేశ, నిష్క్రమణ మార్గాల వద్ద ఉన్న ఏఐ కెమెరాలు భక్తుల కదలికలను నిరంతరం విశ్లేషిస్తాయి. ఏదైనా ప్రాంతంలో సామర్థ్యానికి మించి రద్దీ పెరుగుతుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు తక్షణ హెచ్చరికలు అందజేస్తాయి. ఫలితంగా రద్దీ పెరగకుండా భక్తులను ఇతర చోట్లకు మళ్లించేలా ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు.

ఏపీకి పెరిగిన ఆదాయం

విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగంలో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రాష్ట్ర సొంత ఆదాయం ఏకంగా 18.7 శాతం వృద్ధి చెంది రూ. 74,342 కోట్లకు చేరుకుంది. సాధారణంగా ఆదాయం పెరగాలంటే పన్నులు పెంచడం లేదా కొత్త చార్జీలు విధించడం వంటి విధానాలను ప్రభుత్వాలు అవలంబిస్తుంటాయి. కానీ, ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపకుండానే ఇంత భారీ స్థాయిలో ఆదాయం సమకూరడం పరిపాలనా పరంగా విజయంగా మారింది. సంపద సృష్టికి సరైన నిర్వచనంలా కనిపిస్తోంది.ప్రధాన ఆదాయ వనరులను పరిశీలిస్తే, పన్నుల ఆదాయం 18.8 శాతం× వృద్ధితో రూ. 63,796 కోట్లు గా నమోదైంది. ఇందులో వాణిజ్య పన్నులు 18.3 శాతం , జీఎస్టీ ఆదాయం 18.1 శాతం చొప్పున పెరిగాయి. అలాగే ఎక్సైజ్ శాఖ ద్వారా రూ. 20,083 కోట్లు 19.6% వృద్ధి , స్టాంపులు ఽ రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.8,020 కోట్లు 16.6% వృద్ధి , రవాణా శాఖ ద్వారా రూ. 3,649 కోట్లు 17.3% వృద్ధి ఆదాయం వచ్చింది. వీటితో పాటు గనులు ఽ భూగర్భ వనరుల శాఖ నుంచి 2,086 కోట్లు 13.2% వృద్ధి , అటవీ శాఖ ద్వారా 22 కోట్లు సమకూరాయి.ఈ ఆదాయ వృద్ధి వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన మార్గదర్శకాలు కీలక పాత్ర పోషించాయి. పన్నులు లేదా చార్జీలు పెంచకుండానే.. ఆదాయ లీకేజీలను అరికట్టడం, పరిపాలనా సంస్కరణలు తీసుకురావడం, టెక్నాల జీని విస్తృతంగా వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పారదర్శకత, పర్యవేక్షణ పెరగడం వల్ల వివిధ శాఖల్లో వృథా తగ్గి, వాస్తవ ఆదాయం ఖజానాకు చేరుతోంది. మొత్తంగా, ప్రజలపై భారం వేయకుండానే దాదాపు అన్ని రంగాల్లోనూ 13 శాతం నుంచి 22 శాతానికి పైగా వృద్ధి నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఊరటనిచ్చే అంశం. ఇదే వేగాన్ని భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ, లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయగలిగితే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకునిధులసమీకరణమరింత సులభతరం అవుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

కొత్త ఫార్ములాతో ఎన్నికల బరిలోకి జగన్

విజయవాడ : రాబోయే ఎన్నికల కోసం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరింత బలోపేతం కావాల్సి ఉంది. క్యాడర్‌ను బలోపేతం చేయడం మరియు అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. జగన్ గుడ్డి నమ్మకంతో వెళితే ఈసారి కూడా కష్టాలు తప్పవనే అంచనాలు మాత్రం వినిపిస్తు న్నాయి. ఐదేళ్ల జగన్ పాలనను చూసిన కొన్ని వర్గాల ప్రజలు నేటికీ దానిని మరిచిపోలేకపోతు న్నారు. అయితే సంక్షేమ పథకాలు తనను గట్టెక్కిస్తాయన్న నమ్మకంతో జగన్ ఉన్నారు. ఎక్కువ మంది జగన్ ప్రభుత్వంలో సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన మాట వాస్తవమే. వారంతా తిరిగి జగన్ వైపు చూస్తారన్నది వాస్తవం. అలాగే అభివృద్ధి అనేది లేకపోవడంతో ప్రధానంగా మధ్యతరగతి, ఉద్యోగులు, కొంత పట్టణ ఓటర్లు మాత్రం ఇంకా జగన్ ప్రభుత్వం అంటే ఊగిసలాటలో ఉన్నారు. అయితే జగన్ వారిని మంచి చేసుకుని తన వైపునకు తిప్పుకోవడంలో ఎంత మేరకు సక్సెస్ అవుతారన్నది చూడాల్సి ఉంది.2029 అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఆలోచనలో జగన్ ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిలో భాగంగా 50 ఏళ్ల లోపు వారికి ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వడం, అలాగే 25 నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న వారికి పార్టీ సంస్థాగత బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నుంచి అందుతున్న సమాచారం. అదే జరిగితే సీనియర్ నేతలు తమ వారసులను రాజకీయాల్లోకి దించే అవకాశముంది. అదే సమయంలో కొత్త తరం నాయకత్వానికి బాధ్యతలు అప్పగిస్తారని, పాదయాత్ర సమయంలో ఎంపిక చేసిన వారిని జగన్ దృష్టిలో పెట్టుకుని వారిపైపు మొగ్గు చూపుతారని మరికొందరు అంచనా వేస్తున్నారు. అప్పుడు నియోజకవర్గాలలో రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని కూడా అంచనాలు వైసీపీలో వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో, ఆయా ప్రాంతాల్లోని రాజకీయ పరిస్థితులను బట్టి బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని జగన్ పార్టీ నేతలకు సూచించినట్లు వైసీపీ అధినేత సూచించడంతో అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాను అవలంబిస్తారేమోనన్న అనుమానం అయితే బలంగా నేతల్లో ఉంది. అందుకే ముందుకు వచ్చి డబ్బులు ఖర్చుచేయడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకంజ వేశారని, అనేక మంది నేతలకు టిక్కెట్ డౌట్ ఉండబట్టే యాక్టివ్ గా లేరన్న అభిప్రాయం కూడా ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జ్‌లు మరియు అభ్యర్థుల విషయంలో మార్పులు చేసే దిశ

ఆధ్యాత్మిక వైభవానికి శ్రీశైలం..

భక్తి పారవశ్యంలో భ్రమరాంబ మల్లికార్జున క్షేత్రం

- ఆరుద్రోత్సవ వేళ నేడు స్వర్ణరథంపై స్వామి అమ్మవార్ల దర్శనం

- వేకువజామున మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

- లోకకల్యాణం కోసం దత్తాత్రేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు..

- 31 రోజుల్లో రూ.4.47 కోట్లకు పైగా హుండీ ఆదాయం



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) దక్షిణ కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. కార్తీక మాస పవిత్రతకు తోడు ఆరుద్రా నక్షత్ర పర్వదినం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని అందించనుంది. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామి అమ్మవార్లు స్వర్ణరథంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. మరోవైపు దత్తాత్రేయస్వామికి విశేష అభిషేకాలు, నిత్య కళారాధనలో భక్తి సంగీత కార్యక్రమాలు క్షేత్ర ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిమళింపజేస్తున్నాయి. భక్తుల కానుకలతో హుండీ ఆదాయం కూడా గణనీయంగా నమోదైంది.

స్వర్ణరథంపై స్వామి అమ్మవార్లు..

ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం వేకువజామున శ్రీమల్లికార్జునస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నారు. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు ప్రత్యేక సంకల్పం పఠిస్తారు. దేశంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో వర్షాలు కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించనున్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, అగ్నిప్రమాదాలు, రహదారి ప్రమాదాలు, అకాల మరణాలు దరిచేరకూడదని స్వామివారిని వేడుకోనున్నారు.అనంతరం రథారూఢులైన స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమవుతుంది.



గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు, తిరిగి అక్కడి నుంచి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగనుంది. కోలాటాలు, తప్పెట చిందులు తదితర సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

త్రిమూర్తి స్వరూపునికి విశేషార్చనలు..

శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద కొలువై ఉన్న దత్తాత్రేయస్వామికి గురువారం దేవస్థానం ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తి స్వరూపంగా దత్తాత్రేయుడు ప్రసిద్ధి చెందారు.
శ్రీశైల క్షేత్రంతో దత్తాత్రేయ సంప్రదాయానికి విడదీయలేని అనుబంధం ఉంది. త్రిఫలవృక్షం కింద దత్తాత్రేయుడు తపస్సు చేసినట్లు ప్రతీతి. కలియుగంలో పిఠాపురంలో శ్రీపాదవల్లభుడిగా అవతరించిన దత్తాత్రేయుడు శ్రీశైలంలో చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లు గురుచరిత్ర పేర్కొంటోంది. అనంతరం నృసింహసరస్వతిగా అవతరించిన స్వామి మహాశివరాత్రి రోజున మల్లికార్జునుడిని సేవించినట్లు కూడా ఆధ్యాత్మిక గ్రంథాల్లో ప్రస్తావన ఉంది. తన అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగ వద్ద చేసినట్లు గురుచరిత్రలోని కథనం ఈ క్షేత్ర మహిమను చాటుతోంది.

హుండీకి భక్తుల కానుకల వెల్లువ..

మల్లన్న సన్నిధికి భక్తులు సమర్పించిన కానుకలతో దేవస్థానం ఖజానాకు భారీ ఆదాయం సమకూరింది. గురువారం నిర్వహించిన హుండీల లెక్కింపులో రూ.4,47,85,335 నగదు లభించింది. అక్టోబరు 26 నుంచి నవంబరు 25 వరకు 31 రోజుల వ్యవధిలో భక్తులు ఈ కానుకలను సమర్పించారు. వీటితోపాటు 85 గ్రాముల 900 మిల్లీగ్రాముల బంగారం, 2 కిలోల 980 గ్రాముల వెండి లభించాయి. విదేశీ భక్తుల కానుకల రూపంలో అమెరికా డాలర్లు 722, యూఏఈ దిర్హమ్స్ 270, ఆస్ట్రేలియా డాలర్లు 95, ఇంగ్లాండ్ పౌండ్లు 30, కెనడా డాలర్లు 25, యూరోలు 60 తదితర విదేశీ కరెన్సీ కూడా లభించింది. పటిష్ట భద్రత, సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీ లెక్కింపు చేపట్టారు.

క్రిస్మస్ సందర్భంగా ఒక్కో చర్చికి

రూ.30 వేల సాయం



నిజామాబాద్ క్రిస్మస్ కోసం చర్చిలకు సున్నం వేయడానికి, విద్యుత్ దీపాలంకరణకు అర్హత ఉన్న ప్రతి చర్చికి రూ.30 వేల సాయం అందిస్తామని నిజామాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కె. కృష్ణవేణి తెలిపారు. నమోదైన, అర్హత ఉన్న చర్చిలు టీ జీ వో ఎం ఎం ఎస్. ఈ జీ జీ. గవ్. ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్ ప్రింట్‌ను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని చెప్పారు.

శుభకార్యానికి వచ్చిన

మహిళ బంగారు ఆభరణాలు మాయం

జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో నిన్న గృహ ప్రవేశ వేడుకలకు కరీంనగర్ సీతారాంపూర్, బ్యాంక్ కాలనీకి చెందిన మౌనిక సుకుమార్ దంపతులు వచ్చారు. ధరూర్ గ్రామంలో రత్నాకర్ రెడ్డి నివాసంలో నిర్వహించిన గృహప్రవేశ వేడుకకు వారు హాజరయ్యారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసి బ్యాగులో భద్రపరిచారు. కొద్దిసేపటి తర్వాత బ్యాగును పరిశీలించగా అందులో ఉంచిన సుమారు 9 తులాల ఆభరణాలు కనిపించలేదు. అందులో డైమండ్ నెక్లెస్ తో పాటు ఇతర బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి ఆందోళనకు గురయ్యారు. దీంతో బాధితురాలు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

- నలుగురు మృతి, ఎనిమిది మందికి తీవ్ర గాయాలు



అనంతపురం అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాడికి మండలం రాయలచెరువు దగ్గర హైదరాబాద్ నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న తుపాన్ వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఎనిమిది మందికి తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి తాడిపత్రికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 34 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపు చేశారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.మృతుల్లో యాడికి కి చెందిన సిద్దు, లక్ష్మీప్రసాద్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు

- ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.గురువారం కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్ర భారతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, అలాగే విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా రవీంద్ర భారతి, విజ్ఞాన విహార్ స్కూల్స్ లో గురువారం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు 23 పట్టణ స్థానిక సంస్థల్లో (మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు) పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు– తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్ర భారతి స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎనిమిది పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, ఎన్నికల నిర్వహణ తీరును సమీక్షించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటర్లకు మార్గనిర్దేశం చేస్తున్న తీరును, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, క్రమబద్ధంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని తెలిపారు. పోలింగ్ ఏజెంట్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఓటర్లతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నామని, ఎలాంటి సమస్యలు లేదా ఫిర్యాదులు లేవని వారు వెల్లడించినట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్న ఓటర్లకు నిబంధనల ప్రకారం స్లిప్పులు అందించి, వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని, మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటివరకు 40 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సర్పంచ్ స్థానాల్లో సుమారు 19 శాతం, వార్డు సభ్యుల స్థానాల్లో సుమారు 30 శాతం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని, సాధ్యమైనంత వరకు అదే రోజు సాయంత్రంలోగా ఫలితాలు ప్రకటించేలా కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను పోలీసు భద్రత నడుమ కౌంటింగ్ కేంద్రాలకు తరలించి, కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, ఈ నెల 30వ తేదీన కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అవసరమైన చోట్ల వీడియో గ్రఫీ, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏవైనా న్యాయపరమైన అభ్యంతరాలు తలెత్తితే ఆధారాలుగా ఉపయోగపడేలా ఫుటేజీ భద్రపరుస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే అదనపు పోలీసు బలగాలను పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి ఒక్క ఓటరుకు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత అని, ఈ విషయంలో అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల నిర్వహణలో జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని, వారి కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు సమర్థవంతంగా ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్స్, పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందికి కమిషనర్ అభినందనలు తెలిపారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఓటరుకు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ఓటు వేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తోపాటు విజ్ఞాన విహార్ స్కూల్ లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా జి లక్ష్మీశ, ఆర్డీవో శ్రీనివాస్, రవీంద్ర భారతి స్కూల్ లో ఉయ్యూరు ఆర్డీవో కరుణ కుమారి, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత సమ్మిళిత పథకాలపై అవగాహన పెంచుకోవాలి



- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ సామాన్య ప్రజల్లో పొదుపు, బ్యాంకింగ్ సేవలు,ఆర్థిక క్రమశిక్షణపై పూర్తి అవగాహన కల్పించడమే లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖీఃఏ) ఆధ్వర్యంలో జన సురక్ష కంపేనియన్ ను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం చిన్న శంకరంపేట మండలం గవ్వల పల్లి తాండ లో ఎస్బిఐ గవ్వల పల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత సమ్మిళిత పథకాలు ,సురక్షిత బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఎస్బిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించామన్నారు.బ్యాంకింగ్ లావాదేవీలు, ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలు (ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన), సురక్షితమైన పెట్టుబడి మార్గాలపై గ్రామీణ ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటును పెంచుకోవాలని సూచించారు. మోసపూరిత ఆర్థిక పథకాలు, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారిక బ్యాంకుల ద్వారానే రుణాలు ,ఆర్థిక సేవలు పొందాలని అన్నారు. డిజిటల్ చెల్లింపుల సురక్షిత వినియోగం, సామాజిక భద్రతా పథకాలు (బీమా, పింఛన్ పథకాలు), కేవైసీ నిబంధనలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సదస్సులో బ్రాంచ్ మేనేజర్ శ్రీహరి,శౌరి, స్థానిక సర్పంచ్ అనసూయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి హరీష్ , కోఆర్డినేటర్లు, బ్యాంకు అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు , స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్మార్ట్ వ్యవసాయ సాంకేతికతలను

ప్రోత్సహించాలి

- డా. రాజి రెడ్డి



న్యూఢిల్లీ : మిరప, ఇతర సుగంధ ద్రవ్యాల వంటి అధిక విలువ కలిగిన పంటల్లో రైతులు పురుగుమందులను విచక్షణారహితంగా వినియోగించడం ఆందోళనకరమని, పురుగుమందుల అవశేషాల పర్యవేక్షణకే పరిమితం కాకుండా, వాటి అధిక వినియోగాన్ని నివారించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. డి. రాజి రెడ్డి అన్నారు. ఐసీఏఆర్ , న్యూఢిల్లీ ఆధ్వర్యంలోని అఖిల భారత పురుగుమందుల అవశేషాలు , కలుషిత పదార్థాల పర్యవేక్షణ నెట్‌వర్క్ ప్రాజెక్టు నిర్వహించిన 18వ జాతీయ స్థాయి పురుగుమందుల అవశేషాల పర్యవేక్షణ వార్షిక కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ జి.ఎస్. రంధావా ఆడిటోరియంలో ఈ కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా ప్రారంభోపన్యాసం చేసిన డా. రాజిరెడ్డి, ఉద్యాన పంటలతో పాటు మొత్తం ఆహార సరఫరా వ్యవస్థలో పురుగుమందుల అవశేషాల సమాచారాన్ని సేకరించడం, వివిధ భాగస్వామ్య సంస్థలను సమన్వయం చేయడంలో చేస్తున్న కృషిని అభినందించారు. డ్రోన్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఖచ్చితత్వ ఆధారిత వ్యవసాయ సాంకేతికతలను వినియోగించడం ద్వారా అవసరానికి అనుగుణంగా పురుగుమందులను వాడాలన్నారు. పంటల్లో రసాయన అవశేషాలను తగ్గించి, ఆహార భద్రతను పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు పురుగుమందుల సముచిత వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించాలని కూడా సూచించారు. ఈ సమావేశానికి బెంగళూరులోని సంచాలకులు డా. టి.కె. బెహరా అధ్యక్షత వహించారు. దేశంలోని వివిధ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

నాడు క్రమశిక్షణ, ఐక్యత

కడప : ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వెలిగిపోయిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం నేడు కోర్టు మెట్లు, వీధి పోరాటాలతో రచ్చకెక్కడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. వైఎస్సార్ జీవించి ఉన్నంత కాలం ఆ కుటుంబంలో ఏనాడూ చిన్న పొరపొచ్చాలు కూడా బయటకు రాలేదు. కుటుంబ పెద్దగా ఆయన అందరినీ కలుపుకుపోతూ, ఏవైనా అంతర్గత విభేదాలు తలెత్తినా నాలుగు గోడల మధ్యే సర్దుబాటు చేసేవారు. కానీ ఆయన ఆకస్మిక మరణం తర్వాత, కుటుంబ సభ్యులంతా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిచి ఆయన వెంటే నిలిచారు. అయితే అధికారం, ఆస్తుల వ్యామోహంతో జగన్ అనుసరించిన స్వార్థపూరిత వైఖరి ఆ ఉమ్మడి కుటుంబాన్ని చిందరవందర చేసి, నేడు ఈ దుస్థితికి తీసుకువచ్చింది.వైఎస్సార్ మరణానంతరం జగన్ జైలుకు వెళ్లినప్పుడు, పార్టీ ఉనికిని కాపాడటానికి తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల కాలికి బలపం కట్టుకుని రాష్ట్రమంతా పాదయాత్రలు చేసి ఆయనకు రాజకీయ పునర్జన్మ ఇచ్చారు. కానీ 2019లో అధికారం చేతికి రాగానే జగన్ మనస్తత్వం పూర్తిగా మారిపోయిందని సొంత కుటుంబ సభ్యులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి సంపాదించిన ఆస్తులలో నలుగురు మనవలు, మనవరాళ్లకు సమాన వాటా ఉండాలని విజయమ్మ బహిరంగ లేఖలు, అఫిడవిట్లు విడుదల చేయాల్సి రావడం జగన్ ఏకపక్ష నిర్ణ యాలకు నిదర్శనం. చివరకు సొంత చెల్లెలు షర్మిల తన కుమార్తె వివాహ ఏర్పాట్ల కోసం బెంగళూరులోని యలహంక నివాసానికి వెళ్తుంటే, కోర్టు ఆర్డర్ల పేరుతో పోలీసులను పెట్టి అడ్డుకోవడం ఆ కుటుంబంలో నెలకొన్న అగాధానికి పరాకాష్ట.ఆస్తుల వివాదంతో పాటు కుటుంబంలో జరిగిన నెత్తుటి మరకలు కూడా వైఎస్ కుటుంబ ప్రతిష్ఠను మసకబార్చాయి. సొంత బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్యకు గురికావడం, ఆ కేసులో కుటుంబ సభ్యుల ప్రమేయంపైనే సీబీఐ విచారణ సాగడం, వివేకా కుమార్తె సునీత న్యాయం కోసం ఏళ్ల తరబడి పోరాడాల్సి రావడం అత్యంత విషాదకరం. తన రాజకీయ ప్రయోజనాల కోసం, సొంత మనుషులను కాపాడుకోవడానికి జగన్ అనుసరించిన వైఖరి వల్లే ఒకే రక్తం పంచుకుపుట్టిన వారు బద్ధశత్రువులుగా మారారు.. ముఖ్యంగా యలహంక ప్యాలెస్ వద్ద షర్మిలను పోలీసులు అడ్డుకున్న దృశ్యాలు, విజయమ్మ కంటతడి పెట్టిన ఘటనలు వైరల్ అవుతుండటంతో, వైఎస్సార్ అభిమానులు సైతం జగన్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పదవి, డబ్బు శాశ్వతం కాదని, రక్తసంబంధాలే ముఖ్యమన్న కనీస స్పృహ లేకుండా వ్యవహరించడం వల్లే నేడు వైఎస్ కుటుంబం ఆత్మగౌరవాన్ని కోల్పోయిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు క్రమశిక్షణకు, ఐక్యతకు మారుపేరుగా నిలిచిన వైఎస్ కుటుంబం నేడు చీలికలు పేలికలు కావడానికి ముమ్మాటికీ జగన్ మోహన్ రెడ్డి స్వార్థపూరిత మనస్తత్వమే కారణమని స్పష్టమవుతోంది. రాజకీయాల్లో ప్రత్యర్థులను ఎదుర్కోవడం కంటే, సొంత ఇంట్లో తల్లి, చెల్లి ఆవేదనకు సమాధానం చెప్పలేని స్థితికి ఆయన చేరుకున్నారు. చరిత్రలో ఎన్నో రాజకీయ కుటుంబాలు విభేదాలతో విడిపోయినా, ఆస్తుల కోసం కన్నతల్లిని, చెల్లిని ఇంతలా వేధించిన ఉదంతం మరొకటి లేదని, వైఎస్సార్ ఆత్మ సైతం నేడు క్షోభిస్తోందని ఆయన అభిమానులు మథనపడుతున్నారు.

యూపీలో కాంగ్రెస్ మధ్య ఎస్పీ లొల్లి

లక్నో : వచ్చే ఏడాది జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య జరుగుతున్న చర్చలు హీట్ పెంచుతున్నాయి. రెండు రోజుల క్రితం ఢిల్లీ వేదికగా జరిగిన మొదటి విడత చర్చల్లో రెండు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో.. నిన్న మరోసారి చర్చలు చేశారు. గతంలో 181 సీట్లు కావాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్.. కొంచెం వెనక్కి తగ్గి 130 సీట్ల జాబితాను ఎస్పీ నేతల ముందుంచింది. అటు.. కాంగ్రెస్ వర్గాల్లో చర్చలు నడుస్తుండగానే.. 26 సీట్లు ఇచ్చేందుకు ఎస్పీ సుముఖత వ్యక్తం చేసినట్టు రాజీవ్ రాయ్ వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో గెలుపే లక్ష్యంగా సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన రెండు స్థానాలతో పాటు.. రెండో స్థానంలో నిలిచిన నాలుగు స్థానాలు, మరో 20 నియోజకవర్గాలను జాబితాలో చేర్చినట్టు తెలిపారు.ఇక.. ఎస్పీ 26 సీట్ల ప్రతిపాదనపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు. తామేమీ సీట్ల కోసం అడుక్కోవడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఏకపక్షంగా ఐదు స్థానాలకు తొలి జాబితాను ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. అఖిలేశ్ యాదవ్ సహాయం కోసం ఎదురుచూసే "బిచ్చగాళ్లం" కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారుయూపీ అసెంబ్లీ ఎన్నికల కోసం షామ్లీ, అమ్రోహా, లలిత్‌పూర్‌తో పాటు సహారన్‌పూర్‌లోని బెహత్, సహారన్‌పూర్ రూరల్ నియోజకవర్గాలకు సమాజ్‌వాదీ పార్టీ తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించింది. వాస్తవానికి సహారన్‌పూర్ రూరల్, బెహత్ స్థానాలను పొత్తులో భాగంగా కాంగ్రెస్ ఆశిస్తున్నట్లు సమాచారం. దీని సహారన్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇమ్రాన్ మసూద్ ఈ నిర్ణయంపై మండిపడ్డారు. పొత్తు చర్చల మధ్య ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాకతీ.. సమాజ్‌వాదీ పార్టీ పొత్తు పట్ల నిజాయితీగా ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. "ఎస్పీ ప్రకటన వల్ల మాకు వచ్చే నష్టమేమీ లేదు. కానీ ఈ పోరాటం బీజేపీకి వ్యతిరేకమా లేక కాంగ్రెస్‌కు వ్యతిరేకమా అన్నది కచ్చితంగా తేలాలి. ఇలా ప్రవర్తిస్తే ఇక పొత్తు ఎక్కడ ఉన్నట్లు?" అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు పనిచేస్తాయని, అవసరమైన చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపుతుందని మసూద్ స్పష్టం చేశారు.అయితే.. 403 అసెంబ్లీ స్థానాలున్న యూపీలో గెలుపే లక్ష్యంగా సీట్ల సర్దుబాటు ఉంటుందని ఎస్పీ అధినేత అఖిలేష్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రస్తుతం.. ముందుగా గెలిచే 26 సీట్లతో చర్చలు ప్రారంభమయ్యాయని.. పరస్పర అవగాహనతో తదుపరి చర్చలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.ఇదిలావుంటే.. 2017లో జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ-కాంగ్రెస్ కలిసి పోటీ చేయగా ఘోర పరాజయం ఎదురైంది. 107 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్.. కేవలం ఏడు సీట్లే గెలుచుకుంది. అఖిలేష్‌యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 47 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. 2027 అసెంబ్లీ ఎన్నికల కోసం రెండు పార్టీలు ఇప్పుడు మరోసారి జతకట్టాయి. ఈసారి ఎలాగైనా ఉత్తర్‌ప్రదేశ్‌ను నెగ్గి తీరాలని ఎస్పీ-కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తున్నాయి.

ఎమ్మెల్యే కాకపోయిన.. దానం హడావిడి

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఇంకా ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తుంది. అయితే దానం నాగేందర్ మాత్రం అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నిక మాత్రం జరిగే అవకాశం ఇంకా ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పాత ఎన్నికల పిటిషన్ కారణంగా దీనికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఎన్నికల కమిషన్ కూడా న్యాయస్థానంలో కేసులున్నందునే ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేయలేకపోయినట్లు ప్రకటించింది. అయితే బీజేపీ నేతలు మాత్రం ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఆలస్యం అవుతుండటంతో ఆ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, అలాగే సమస్యలను కూడా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రజలు కూడా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. అయితే దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దానం నాగేందర్‌పై ఈ ఏడాది సెప్టెంబర్ 18న తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేసింది. సెప్టెంబర్ 24న సుప్రీంకోర్టు కూడా ఈ తీర్పును సమర్థించింది. దీనితో అసెంబ్లీ కార్యదర్శి సెప్టెంబర్ 26న ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత విజయారెడ్డి దాఖలు చేసిన పాత ఎన్నికల పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆ పిటిషన్‌పై తుది తీర్పు వచ్చే వరకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయబోమని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీన హైకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో అప్పటి నుంచి ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయాన్ని ఎన్నికల సంఘం కూడా తీసుకోలేకపోతుంది. ఫలితంగా ఉప ఎన్నికపై నీలినీడలు అలుముకున్నాయి.తెలంగాణ వార్తలు దానం నాగేందర్ ఇప్పటికే అనర్హతకు గురైనందున విజయారెడ్డి పిటిషన్‌కు కాలం చెల్లిందని, దాన్ని కొట్టివేసి ఉప ఎన్నికకు మార్గం సుగమం చేయాలని కోరుతూ బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి ఈ ఏడాది నవంబర్లో హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టులో ఉన్న విజయారెడ్డి ఎన్నికల పిటిషన్ మరియు చింతల రామచంద్రారెడ్డి దరఖాస్తుపై వెలువడే నిర్ణయంపైనే ఉప ఎన్నిక షెడ్యూల్ ఆధారపడి ఉంది. ఒకవేళ కోర్టు విజయారెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తే, కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నిక నిర్వహించేందుకు మార్గం సుగమం అవుతుంది. అప్పటి వరకూ ఖైరతాబాద్ ఉప ఎన్నిక విషయంలో మాత్రం స్పష్టత రాదు. మరొకవైపు దానం నాగేందర్ మాత్రం ఉప ఎన్నిక ఎప్పుడైనా జరగొచ్చని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యక్రమాలకు హాజరవుతూ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఉప ఎన్నిక ఎప్పుడు జరిగినా గెలుపు తనదేనన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ కేసీఆర్ గెలువాలని
పాదయాత్ర చేపట్టిన అదిలాబాద్ యువకుడు

ఆదిలాబాద్ : మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటూ ఆదిలాబాద్‌లోని గిమ్మా గ్రామానికి చెందిన జరా ప్రశాంత్ గిమ్మ గ్రామం నుండి పాద యాత్రను ప్రారంభించాడు. మాజీ మంత్రి జోగు రామన్న పాదయాత్ర కార్యక్రమానికి హాజరై జండా ఊపి ప్రారంభించారు. మొదట హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు రామన్నమాట్లాడుతూ నేడు గిమ్మ గ్రామం నుండి చేపట్టిన ఈ పాదయాత్ర యాదగిరిగుట్ట వరకు కొనసాగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రైతుల పట్ల వ్యవహరిస్తున్న విధి విధానాలపై యావత్ రైతాంగం అసంతృప్తిగా ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపిల పాలనలో ఇటు రైతాంగంతో పాటు ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మనసు చలించిన జార ప్రశాంత్ తీసుకున్న నిర్ణయం కఠినమైనప్పటికీ తన సాహసోపేత నిర్ణయానికి ధైర్యంగా నిలబడతామని భరోసా కల్పించారు.

సంపదకు సార్థకత.. భక్తికి స్వర్ణాభిషేకం

- శ్రీవారి పాదాల చెంత రూ.206 కోట్ల కానుక..
- 121 కిలోల బంగారు, వజ్రాభరణాలు సమర్పించిన చెన్నై జైన్ దంపతులు..
- మానవ సేవే మాధవ సేవ.. సంపన్నులు పేదల సంక్షేమానికి ముందుకు రావాలి..
- శ్రీకృష్ణదేవరాయల భక్తి పరంపరకు నేటి దాతృత్వం కొనసాగింపు..
- తిరుమలలో భావోద్వేగంతో మాట్లాడిన సీఎం చంద్రబాబు









తిరుమల(ప్రశ్న న్యూస్) సంపద సంపాదించడం గొప్ప కాదు, సంపాదించిన సంపదను సమాజానికి, భగవంతుడి సేవకు సద్వినియోగం చేయడమే అసలైన గొప్పతనం! కోట్లాది రూపాయల ఆస్తులు, అంతులేని ఐశ్వర్యం మనిషికి శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవు. భక్తి, ధర్మం, దాతృత్వం, మానవ సేవలే జీవితానికి నిజమైన సార్థకతను చేకూరుస్తాయి. ఈ ఆధ్యాత్మిక సందేశానికి తిరుమల శ్రీవారి సన్నిధిలో ఓ అపూర్వ దాతృత్వ ఘట్టం వేదికైంది. చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామికి ఏకంగా రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించి తమ అపార భక్తిని చాటుకున్నారు. స్వామివారి పట్ల తమకున్న అచంచల విశ్వాసానికి ఈ మహా కానుకను ప్రతీకగా నిలిపారు. ఈ అపూర్వ ఘట్టంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీసమేతంగా పాల్గొని దాతృదంపతులను అభినందించారు.గురువారం తిరుమలలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, ఉన్నతాధికారులు జైన్ దంపతుల నుంచి ఆభరణాలను స్వీకరించారు. అనంతరం దాతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తిరుమల పవిత్ర క్షేత్రంలో ఇలాంటి మహత్తర ఘట్టంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రపంచంలో బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఎందరో ఉన్నప్పటికీ సంపాదించిన సంపదను ధర్మకార్యాలకు వినియోగించే భాగ్యం కొందరికే దక్కుతుందని వ్యాఖ్యానించారు. ఆ అదృష్టాన్ని అందిపుచ్చుకున్న వర్ధమాన్ జైన్ దంపతులు సమాజానికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.

రాజుల భక్తి.. దాతల దాతృత్వం..

తిరుమల చరిత్రలో రాజులు, చక్రవర్తులు, భక్తులు సమర్పించిన కానుకలకు విశిష్ట స్థానం ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. పల్లవులు, చోళులు, చేరులు, పాండ్యులు, మైసూరు, మరాఠా రాజులు శ్రీవారి ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు రత్నకిరీటాలు, పీతాంబరాలు సహా ఎన్నో విలువైన ఆభరణాలను స్వామివారికి సమర్పించారని వివరించారు. ఆనాటి రాజుల భక్తి నుంచి నేటి జైన్ దంపతుల దాతృత్వం వరకు శ్రీవారిపై భక్తి పరంపర నిరంతరాయంగా ఆచరణలో పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం పనిచేసే వారే భగవంతుడికి అత్యంత సన్నిహితులని అన్నారు. సంపన్నులు తమ సంపదలో కొంత భాగాన్ని పేదల సంక్షేమం, విద్య, వైద్యం, ఆధ్యాత్మిక సేవలకు కేటాయించాలని సూచించారు. భక్తులు సమర్పించే ప్రతి రూపాయిని వారి సౌకర్యాలు, సేవల కోసమే టీటీడీ ఖర్చు చేస్తోందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో టీటీడీ సహకారంతో ఐదు వేల దేవాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు అధికంగా నివసించే ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామన్నారు. ఆలయాలు ఉన్న ప్రతిచోటా అన్నప్రసాద సేవలను విస్తరిస్తామని తెలిపారు. 'ప్రాణదానం' ద్వారా వైద్య సేవలు, 'విద్యాదానం' ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతను జోడించి సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

పచ్చదనం.. గోసంరక్షణ.. వేద పరిరక్షణ..

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు 'వృక్షో గోవిందం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చంద్రబాబు తెలిపారు. తిరుమలలో భవిష్యత్తులో నీటి కొరత అనే మాటే వినిపించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హంద్రీ-నీవా ద్వారా కల్యాణి డ్యాంకు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలించే ప్రణాళికలు ఉన్నాయని, అవసరమైతే తిరుమలకు రెండో పైప్‌లైన్ కూడా నిర్మిస్తామని వెల్లడించారు. తిరుమల కొండపై పచ్చదనాన్ని, పవిత్రతను కాపాడే విషయంలో రాజీ పడకూడదని





టీటీడీ అధికారులకు సూచించారు. గోసంరక్షణ, వేద పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, ఈ కార్యక్రమాలకు టీటీడీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. శ్రీవారి సేవకులు భక్తిశ్రద్ధలతో అందిస్తున్న సేవలను మరింత ప్రోత్సహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి భక్తుల్లో విశ్వాసం మరింత పెరిగేలా ఆలయాల పవిత్రత, ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించాలన్నారు.



శ్రీవారి కృపే నాకు పునర్జన్మ...



తిరుమలతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. అలిపిరి



వద్ద తనపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ, ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే ఆ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. అత్యంత పకడ్బందీగా దాడి జరిగినప్పటికీ స్వామివారి కృపతో ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నారు. వెంకటేశ్వరస్వామి తనకు ప్రాణభిక్ష పెట్టారని, పునర్జన్మ ప్రసాదించారని భావోద్వేగంగా చెప్పారు. నమ్ముకున్న వారికి శ్రీవారు అండగా నిలుస్తారనే విశ్వాసం తన జీవితంలోనూ నిజమైందని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌తో పాటు భగవంతుడి ఆశీస్సులు తోడవడంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తిరుమలను కేవలం దర్శన క్షేత్రంగానే కాకుండా ధర్మం, దాతృత్వం, సేవ, సంస్కృతికి ప్రపంచస్థాయి ప్రతీకగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

సంవిధాన్ రక్ష మార్చ్ కు భారీ ఎత్తున
తరలి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) టిపిసిసి ఆదేశాల మేరకు హైదరాబాద్ నగరంలో నిర్వహించిన సంవిధాన్ రక్ష మార్చ్ కు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలి సంవిధాన్ రక్ష మార్చ్ కు మేడ్చల్ మల్కాజ్గిరి వెళ్లారు. మేడ్చల్ తో పాటు గుండ్ల పోచంపల్లి, పూడూరు. కిష్టాపూర్ డివిజన్లతో పాటు షామీర్పేట్ అలియాబాద్ మూడు చింతలపల్లి ఘట్కేసర్ కీసర కాప్రా జవహర్ నగర్ అల్వాల్, కొంపల్లి సుచిత్ర కుత్బుల్లాపూర్, బాచుపల్లి, కూకట్పల్లి ప్రాంతాల నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు. ప్రతి డివిజన్ నుండి 100 మంది కార్యకర్తలు పైన సంవిధాన్ రక్ష మార్చ్ కు తరలి వెళ్లారు. ఆయా డివిజన్ల అధ్యక్షులు ఆ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. మేడ్చల్ డివిజన్ అధ్యక్షులు చిలక రాజు, గుండ్ల పోచంపల్లి డివిజన్ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్, పూడూరు కిష్టాపూర్ డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలి వెళ్లారు.





ఏడుగుళ్ల దేవాలయం, మజీద్ లను
తొలగించకుండా చూడాలి

ఎమ్మెల్యేకు మల్లారెడ్డికి వినతి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పట్టణంలోని ఏడుగుళ్ల దేవాలయం, మజీద్ ని తొలగించొద్దంటూ ఆయా దేవాలయ ప్రతినిధులు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఎన్ హెచ్ 44 జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా దేవాలయం తో పాటు ఏడుగుళ్ల దేవాలయం, మజీద్ ను తొలగించేందుకు ఎన్.హెచ్ 44 జాతీయ రహదారి అధికారులు ఏడుగుళ్ల దేవాలయం తో, మజీద్ కు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయా దేవాలయ ప్రతినిధులు ఎమ్మెల్యే మల్లారెడ్డిని కలిసి ఏడుగుళ్ల దేవాలయం తో పాటు మజిదును తొలగించవద్దని కోరారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించవలసి వస్తే ఈ దేవాలయాలను నిర్మించుకునేందుకు స్థలాలను కేటాయించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డిని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నేత భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరులో పాక్ డ్రామాకు బ్రేక్..

సోషల్ మీడియా వ్యతిరేకతతో రెండు షోలు రద్దు!



బెంగళూరులో పాకిస్థానీ టీవీ డ్రామా 'దార్-ఏ-నిజాత్' ప్రైవేట్ స్క్రీనింగ్‌ల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. నవంబర్ 28, డిసెంబర్ 5 తేదీల్లో నగరంలోని రెండు వేర్వేరు వేదికల్లో ప్రదర్శించాల్సిన ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వాహకులు రద్దు చేశారు. సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, అదే సమయంలో బెంగళూరు పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టడంతో నిర్వాహకులు వెనక్కి తగ్గారు. వివరాల్లోకి వెళితే, 'దార్-ఏ-నిజాత్' సీరియల్‌కు సంబంధించిన ప్రత్యేక వాచ్ పార్టీలను రెండు వేర్వేరు బృందాలు ఏర్పాటు చేశాయి. మొదటి కార్యక్రమాన్ని 'ది బ్లూమ్ సొసైటీ సిస్టర్స్ క్లబ్' ఆధ్వర్యంలో నవంబర్ 28న సాయంత్రం 6 గంటలకు ఫ్రేజర్ టౌన్‌లోని 'షీష్‌కబాబ్' రెస్టారెంట్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆ డ్రామాకు చెందిన 34, 35 ఎపిసోడ్‌లను ప్రదర్శించి, అనంతరం పర్షియన్, అరబిక్ వంటకాలతో విందు ఇవ్వాలని ప్లాన్ చేశారు. ఇక రెండో కార్యక్రమాన్ని 'ది స్టార్ క్లబ్' ఆధ్వర్యంలో డిసెంబర్ 5న జయమహల్ ఎక్స్‌టెన్షన్‌లోని ఒక ప్రైవేట్ థియేటర్‌లో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఈ స్క్రీనింగ్‌లకు సంబంధించిన ప్రమోషనల్ పోస్టర్లు ఇన్‌స్టాగ్రామ్ సహా ఇతర సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం మొదలైంది. ముఖ్యంగా ఈ కార్యక్రమాలకు హాజరయ్యే అతిథులు 'పాకిస్థానీ దుస్తులు' (ఝఎఅఝఅఅ ఎశ్రీశ్రేష్ఠ-అఅస్త్ర) ధరించి రావాలని ఆహ్వాన పత్రికల్లో డ్రెస్ కోడ్ విధించడంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో పాకిస్థానీ వినోద కార్యక్రమాలను ప్రోత్సహించడం ఏమిటంటూ పలువురు ఎక్స్ వేదికగా బెంగళూరు సిటీ పోలీసులను, పోలీస్ కమిషనర్‌ను ట్యాగ్ చేస్తూ ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన బెంగళూరు పోలీస్ కమిషనర్ ఆర్. హితేంద్ర, ఈ రెండు కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు. ప్రదర్శనల వల్ల నగరంలో నిరసనలు చెలరేగి శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్న ఆందోళనతో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు నిర్వాహకులను సంప్రదించి వివరాలు సేకరించారు. పోలీసుల విచారణ, ఆన్‌లైన్‌లో వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో రెండు వేదికల నిర్వాహకులు ఈ ప్రదర్శనలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల కోసం సరదాగా ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ కార్యక్రమం కాస్తా పెద్ద వివాదంగా మారడంతో రద్దు చేసుకున్నట్లు డిసెంబర్ 5వ తేదీ నిర్వాహకులు మీడియాకు తెలిపారు. నవంబర్ 28న జరగాల్సిన షో కూడా రద్దయినట్లు రెస్టారెంట్ యాజమాన్యం ధృవీకరించింది. ఈ రెండు షోలు రద్దయిన విషయాన్ని పులకేశినగర్ పోలీసులు కూడా అధికారికంగా ధృవీకరించారు.

ఈథా కోసం కఠోర సాధన



తమాషా, లావణీ వంటి నృత్యరీతుల ద్వారా ప్రసిద్ధికెక్కిన మహారాష్ట్ర జానపద కళాకారిణి విఠాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న 'ఈథా' చిత్రంలో శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా కోసం శ్రద్ధాకపూర్ ప్రత్యేకంగా సంప్రదాయ నృత్యరీతుల్ని నేర్చుకున్నది. ఒక్కోపాట కోసం 25రోజుల పాటు కఠోర సాధన చేసిందని చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఊటేకర్ చెప్పారు. ఇటీవల జరిగిన 'జీ జీ రే జీ' పాట విడుదల సందర్భంగా ఆయన ఈ విషయాల్ని పంచుకున్నారు. 'రెండు కాళ్లకు దాదాపు నాలుగు కిలోల బరువున్న గజ్జెలను కట్టుకొని ఎనిమిది గంటల పాటు నాన్‌స్టాప్‌గా ప్రాక్టీస్ చేసేది. అంత బరువుతో నృత్యం చేయడం వల్ల ఆమె పాదాలు వాచిపోయి కనిపించేవి. తమాషా, లావణి వంటి కళారూపాల్ని లోతుగా అర్థం చేసుకోవడంతో పాటు విఠాబాయి పాత్రలో పరకాయప్రవేశం చేసింది. పాట చిత్రీకరణ రెండో రోజు ఆమె కండరాలకు గాయం కావడంతో షూటింగ్‌ను నిలిపివేశాం. ఆ గాయం కారణంగా శ్రద్ధాకపూర్ కన్నీళ్లు పెట్టుకుంది. నెలరోజుల వ్యవధిలోనే ఆమె పూర్తిగా కోలుకొని సెట్స్‌లోకి అడుగుపెట్టింది. ఈ పాత్రలో శ్రద్ధాకపూర్‌ని తప్ప మరొకరిని ఊహించలేం' అని లక్ష్మణ్ ఉటేకర్ పేర్కొన్నారు.

రవితేజ సినిమా షూటింగ్‌లో కలకలం..

జీహెచ్‌ఎంసీ ఉద్యోగినంటూ రూ.30 వేలు డిమాండ్.. !



మాస్ మహారాజా రవితేజ సినిమా షూటింగ్ జరుగుతున్న ప్రాంతంలో ఓ వ్యక్తి హల్‌చల్ చేయడం కలకలం రేపింది. తాను జీహెచ్‌ఎంసీ ఉద్యోగినంటూ సినిమా యూనిట్‌ను బెదిరించి, అనుమతుల పేరుతో రూ.30 వేలు డిమాండ్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రవితేజ హీరోగా నటిస్తున్న ఓ సినిమా షూటింగ్ ఈ నెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని వెస్ట్ మారేడుపల్లి, నెహ్రూ నగర్ కాలనీలో నిర్వహించారు. అక్కడ ఉన్న ఓ పురాతనమైన ఇంట్లో సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో షూటింగ్ జరుగుతున్న ప్రాంతానికి రెజిమెంటల్ బజార్‌కు చెందిన హరి (35) అనే వ్యక్తి వచ్చాడు. ఇతడు ఓ మాజీ కార్పొరేటర్ భర్తకు అనుచరుడిగా ఉన్నట్లు సమాచారం. ఈ నెల 24న సినిమా యూనిట్ మేనేజ్‌మెంట్ వద్దకు వెళ్లిన హరి.. తాను జీహెచ్‌ఎంసీ ఉద్యోగినని పరిచయం చేసుకున్నాడు. షూటింగ్ నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు తీసుకోలేదని ఆరోపిస్తూ యూనిట్ సభ్యులను ప్రశ్నించాడు. అనుమతులు లేకుండా షూటింగ్ ఎలా నిర్వహిస్తారని నిలదీస్తూ, వెంటనే జీహెచ్‌ఎంసీకి చలానా కట్టాలని డిమాండ్ చేశాడు. లేదంటే తనకు రూ.30 వేలు ఇవ్వాలని బెదిరించినట్లు తెలుస్తోంది. అయితే, హరి చేసిన డిమాండ్‌పై సినిమా యూనిట్ ప్రతినిధులు స్పందిస్తూ.. ఇప్పటికే షూటింగ్ నిర్వహణకు సంబంధించి జీహెచ్‌ఎంసీతో పాటు పోలీస్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నామని స్పష్టం చేశారు. సంబంధిత శాఖలకు చలానాలు కూడా చెల్లించామని వివరించారు. అయినప్పటికీ హరి తన బెదిరింపులను ఆపకుండా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విసిగిపోయిన సినిమా యూనిట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు హరిపై మారేడుపల్లి పోలీసులను ఆశ్రయించారు. జరిగిన ఘటనపై ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ తిరుపతి వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణ అనంతరం హరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సినిమా షూటింగ్‌లకు సంబంధించి అనుమతుల పేరుతో ఇలా డబ్బులు డిమాండ్ చేయడం సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. ముఖ్యంగా తాను ప్రభుత్వ ఉద్యోగినని చెప్పుకుంటూ సినిమా యూనిట్‌ను బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఘటనపై పోలీసులు తదుపరి విచారణ చేపడుతున్నారు.

భోగి ఈవెంట్స్‌కి అనుపమ ఎందుకు రావడం లేదు

- అసలు విషయం చెప్పిన హీరోయిన్.. !



టాలీవుడ్‌లో ప్రస్తుతం 'భోగి' సినిమా చుట్టూ మంచి చర్చ నడుస్తోంది. యంగ్ హీరో శర్వానంద్, డింపుల్ హయాతి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. దర్శకుడు సంపత్ నంది తెరకెక్కించిన ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో శర్వానంద్, డింపుల్ హయాతి తదితరులు సందడి చేస్తున్నారు. అయితే ఈ వేడుకల్లో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ కనిపించకపోవడం అభిమానుల్లో చర్చకు దారితీసింది. అసలు అనుపమ ఎందుకు ఈ కార్యక్రమాలకు హాజరు కావడం లేదంటూ సోషల్ మీడియాలో ప్రశ్నలు వినిపించాయి. తాజాగా ఈ విషయంపై అనుపమ స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చింది. 'భోగి' సినిమా ఈవెంట్లకు అనుపమ హాజరు కాకపోవడానికి కారణం తనకు ముందుగా ఉన్న షూటింగ్ కమిట్‌మెంట్స్ అని వెల్లడించింది. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టింది. సినిమా ప్రయోజనం కోసం షూటింగ్ తేదీల్లో వచ్చిన పలు మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు తాను ఎంతగానో ప్రయత్నించానని తెలిపింది. అయితే చివరకు తన గతంలోనే ఖరారైన ఇతర సినిమా పనుల కారణంగా ఊటీలో జరుగుతున్న షూటింగ్‌లో పాల్గొనాల్సి వచ్చిందని వివరించింది. ఈ పరిస్థితిని అర్థం చేసుకుని తనకు సహకరించిన 'భోగి' చిత్ర బృందానికి అనుపమ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. ప్రస్తుతం తాను సినిమా ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోయినా, తన మనసంతా చిత్ర బృందంతోనే ఉందని పేర్కొంది. ప్రేక్షకులంతా 'భోగి' సినిమాను థియేటర్లలో చూసే రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పుకొచ్చింది. దీంతో ఈ సినిమా ఈవెంట్లకు అనుపమ రాకపోవడంపై జరుగుతున్న చర్చకు తెరపడినట్లయింది. శర్వానంద్ హీరోగా, డింపుల్ హయాతి హీరోయిన్‌గా నటించిన 'భోగి'కి సంపత్ నంది దర్శకత్వం వహించారు. పల్లెటూరి నేపథ్యంలో సాగే రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విడుదలకు ముందే సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ప్రమోషనల్ కంటెంట్, ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. రేపు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండటంతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఆస్కార్ రేసులో రామాయణ ముందడుగు



భారతీయ బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తున్న 'రామాయణ' చిత్రం ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారాల బరిలో ముందడుగు వేసింది. ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ విభాగంలో పోటీపడుతున్న సినిమాల జాబితాలో చోటు దక్కించు కుంది. ఇందులో అవెంజర్స్: డూమ్స్ డే, డ్యూన్ పార్ట్-3, ది ఒడిస్సీ, స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూడే, ప్రాజెక్ట్ హేల్ మేరీ వంటి హాలీవుడ్ చిత్రాలు ఉండటం విశేషం. విజువల్ ఎఫెక్ట్స్ విభాగానికి సంబంధించి ఉత్తమ 20 చిత్రాల జాబితాలో 'రామాయణ' చోటు సంపాదించు కుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన విజువల్ ఎఫెక్ట్స్ బృందాలు పనిచేస్తున్న చిత్రాలతో 'రామాయణ' పోటీలో నిలవడం భారతీయ సినిమా తాలూకు సాంకేతిక ప్రతిభకు దక్కిన గుర్తింపుగా ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. డిసెంబర్ 15న పది చిత్రాలతో అధికారిక షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించనున్నారు. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న జరగనుంది. ఇప్పటికే ఉత్తమ అంతర్జాతీయ చిత్రాల విభాగంలో గోంథల్, అంఘ్ వంటి భారతీయ చిత్రాలు ఆస్కార్ బరిలో అర్హత సాధించాయి. రణ్‌బీర్‌కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మించిన 'రామాయణ' ప్రపంచ బాక్సాఫీస్ వద్ద 1700కోట్ల పైచిలుకు వసూళ్లతో జైత్రయాత్ర కొనసాగిస్తున్నది.

తెలుగు సినిమా గర్వించే వృషకర్మ



'వృషకర్మ' వినూత్నమైన కథ. ఎప్పుడూ చూడని విజువల్స్ ఈ సినిమాలో ఉంటాయి. ప్రతీ ఫ్రేమ్‌లో వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది. తెలుగు సినిమా గర్వంగా చెప్పుకునే చిత్రమవుతుంది' అన్నారు నాగచైతన్య. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'వృషకర్మ'. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించింది. డిసెంబర్ 4న విడుదలకానుంది. బుధవారం నెల్లూరులో ట్రైలర్‌ను విడుదల చేశారు. అతీంద్రియ శక్తులు, ట్రెజర్ హంటింగ్, వేద విజ్ఞానం నేపథ్య అంశాలతో ట్రైలర్ ఆసాంతం ఉత్కంఠను పంచింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ..దర్శకుడు కార్తీక్ దండు సరికొత్త విజన్‌తో ఈ చిత్రాన్ని ప్రజెంట్ చేశాడని చెప్పారు. సినిమా విజయంపై ధీమాగా ఉన్నామని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

రాజ్యాంగం...అంబేద్కర్ అంటే
బీసీలకు అర్థం కావాలే...

- అంబేద్కర్‌ను అవమానించేది రెండు జాతీయ పార్టీలే
- అంబేద్కర్‌ను ఎస్సీలకే పరిమితం చేసింది బ్రాహ్మణులే
- రాష్ట్రంలో ఎక్కడా లేని పరిస్థితులు మంథనిలో ఉన్నయ్
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని(ప్రశ్న న్యూస్) భారత రాజ్యాంగం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను బీసీలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీనగర్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం హాల్ లో డా ,కదిరె కృష్ణ రచించిన అద్వితీయ నాయకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అనే పుస్తకాన్ని తెలంగాణ తొలి స్పీకర్,శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి ,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తో ఆయన కలిసి ఆవిష్కరించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై జరిగే దాడిపై కదిరే కృష్ణ ఆవేదన, ఆందోళన చెందుకున్న క్రమంలో సమజానికి తెలియజేసేలా సభ పెట్టాలని తాము ముందుంటామని హమీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే తనకు కదిరె కృష్ణతో ఆశ్చర్యకరంగా కలిశామని, మహాత్మా పూలే గురించి ఇచ్చిన ఉపన్యాసాలు విని తాను కలువాలంటే కదిరె కృష్ణ నిరాకరించారని, ఆ తర్వాత తగరం శంకర్‌లాల్‌తో ఫోన్ చేయించి కలిశామని గుర్తు చేశారు. అయితే డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ప్రత్యక్షంగా కాంగ్రెస్ పార్టీ అవమానిస్తే పరోక్షంగా బీజేపీ అవమానిస్తోంది, రెండు జాతీయ పార్టీలో దొందుదొందేనని ఆయన ఎద్దేవా చేశారు. 80ఏండ్ల క్రితం బ్రాహ్మణులు అంబేద్కర్‌ను ఎస్సీలకే పరిమితం చేశారని, ఆనాటి నుంచి ఈనాటి వరకు అదే కొనసాగుతుందని, కానీ బీసీల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలకు ఏనాడు అవమానం అంటే తెలియదని, కులవృత్తులు చేసుకునే బీసీలు వివిధ పనుల నిమిత్తం బ్రాహ్మణుల ఇండ్లకు వెళ్లేవారని, కానీ ఎస్సీలకు అలాంటి పరిస్థితులు లేకపోవడంతో వారిని ఊరికి దూరంగా ఉంచారన్నారు. దీంతో ఎస్సీల్లో కసి పెరిగి కలిసి ఉంటున్నారని, బీసీల్లో కులాల విభజన జరిగి ఐక్యంగా ఉండలేకపోతున్నారన్నారు. తాను ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఒక్కసారి గెలిస్తే అనేక చిత్ర హింసలకు, ఇబ్బందులకు గురి చేశారని, తాను ఐదోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండటంతో ప్రస్తుతం మంథనిలోతనపైనే చర్చ జరుగుతుందే తప్ప స్థానిక ఎమ్మెల్యేపై చర్చ జరుగడం లేదన్నారు. మంథనిలో బ్రాహ్మణుల ఆలోచనలు బహుజనుల ఆలోచనలను చంపేస్తున్నాయని, తాము రాజ్యాంగం పట్టుకుని బ్రాహ్మణుల ఆలోచనలు వ్యతిరేకిస్తున్నామని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగం, అంబేద్కర్ గురించి బీసీలు అర్థం చేసుకునే చైతన్యం రావాలని, ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు..

అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్ ఐ ఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఎస్ఐఆర్ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో అర్హులు ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని తెలిపారు. ఏఎస్ డీ డీ కింద 58,567 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, అలాగే సేకరణ ఈ నెల 18వ తేదీన మొదలై 30వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఎన్యూమరేషన్ క్లెయిమ్, అభ్యంతరాల పరిష్కారం డిసెంబర్ 15వ తేదీ వరకు చేస్తారని, తుది ప్రచురణ డిసెంబర్ 22వ తేదీన ఉంటుందని వెల్లడించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం-6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామాయంపేటలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని మెదక్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బహుజన సంఘాల నాయకులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా బహుజన నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు స్వేచ్ఛ సమానత్వం సోదరభావం కల్పించిందని తెలిపారు.రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.అణగారిన వర్గాల అభ్యున్నతికి సామాజిక న్యాయం సాధనకు అంబేద్కర్ చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు ఆశయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని వాటి పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.కుల మత ప్రాంతీయ భేదాలు లేకుండా సమానత్వ భావనతో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు పాతూరి రాజు రాష్ట్ర నాయకులు లద్ద నర్సింలు బీసీ సంక్షేమ సంఘం గౌరవధ్యక్షులు మెదక్ జిల్లా మెట్టు గంగారం బీసీ నాయకులు పంజరి సత్యం ఎంపిఎఫ్ నాయకులు చంద్రం కోమటిపల్లి రాజిరెడ్డి కాత్రియాల గడ్డం సిద్దిరాములు పాల్గొన్నారు.

కమీషన్ దోపిడీ,లైసెన్స్ రద్దు.
రైతును ముంచితే వేటు తప్పదు: ఛైర్మన్

- అధిక కమీషన్,లైసెన్స్ గోవిందా.ఛైర్మన్ చేతిలో ఏజెంట్ల భవిత
- బోయిన్ పల్లి మార్కెట్ లో ఛైర్మన్ కొరడా,అడ్డుగోడలు కమీషన్ కు చెక్ పడేనా.?
- ఏజెంట్ ఆగడాలకు లైసెన్స్ ఎసరు?నోటిసులకు జవాబు, వేటుకు రంగం సిద్ధం:ఛైర్మన్
- దళారుల దందాపై ఛైర్మన్ ఉక్కుపాదం, రైతు కష్టానికి ఎసరు, కమీషన్ ఏజెంట్ కు గుబులు
- బోయిన్ పల్లి మార్కెట్ లో గత కొన్ని రోజులుగా పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయి.కక్కృతితో ఉపాధికే ఎసరు పెట్టుకుంటున్న వర్తకులు
- వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు రాహుల్ రాజ్ ఆదేశాలను తూచ తప్పకుండా అమలు చేస్తున్న మార్కెటింగ్ అధికారులు
- కమిటీ కూడా అధికారులకు సపోర్ట్ గా నిలిచి, నిజాయితీ లేని వాళ్లపై నిఘా పెట్టారు
- "మహాంకాళి వేజిటెబుల్ కమీషన్ ఏజెంట్ షాపు నెంబర్ బి:11/1
- (బిడ్డింగ్ రిజిస్టర్ కి తక్ పట్టి కి సంబంధం లేదు.)లెక్కల గోల్ మాల్ పై స్పెషల్ డ్రైవ్ లో అధికారులు సెక్రటరీకి ఫిర్యాదు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో కమిషన్ దోపిడీ.. లైసెన్స్ రద్దుకు రంగం సిద్ధం? ఆసియాలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్ అయిన బోయిన్ పల్లి మార్కెట్.కూరగాయల మార్కెట్‌లో రైతుల నుండి నిబంధనలకు విరుద్ధంగా అదనపు కమిషన్ వసూలు చేసిన ఏజెంట్ల వ్యవహారం ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది.కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చిన అన్నదాతల నుండి ప్రభుత్వ నిబంధనలకు మించి కమిషన్ దండుకున్నట్లు మార్కెట్ కమిటీ,అధికారుల దృష్టికి వచ్చింది.ఈ అక్రమ వసూళ్లపై తీవ్రంగా స్పందించిన మార్కెట్ యంత్రాంగం,సదరు కమిషన్ ఏజెంట్‌కు తక్షణమే షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరింది.నోటీసు అందుకున్న ఏజెంట్,తనపై వచ్చిన ఆరోపణలపై మార్కెట్ కమిటీకి అధికారికంగా తన సమాధానాన్ని సమర్పించాడు. అయితే,ఏజెంట్ ఇచ్చిన వివరణపై మార్కెట్ కమిటీ చైర్మన్,అధికారులు ఏ మేరకు సంతృప్తి చెందుతారనేది ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏజెంట్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసే లేదా శాశ్వతంగా రద్దు చేసే అధికారం మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఉందా అనే చర్చ జోరుగా సాగుతోంది. తెలంగాణ వ్యవసాయ మార్కెట్ల చట్టం (1966) ప్రకారం, నిబంధనలు అతిక్రమించే ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునే పూర్తి అధికారాలు మార్కెట్ కమిటీకి ఉంటాయి.చైర్మన్ అధ్యక్షతన జరిగే మార్కెట్ కమిటీ సమావేశంలో మెజారిటీ సభ్యుల తీర్మానం ద్వారా సదరు ఏజెంట్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం గానీ, రద్దు చేయడం గానీ చేయవచ్చు.ఒకవేళ తక్షణ చర్యలు అవసరమైతే చైర్మన్ ఆదేశాల మేరకు మార్కెట్ కార్యదర్శి (సెక్రటరీ) ద్వారా తాత్కాలిక సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసే అవకాశం కూడా చట్టంలో ఉంది.దీంతో బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ తదుపరి తీసుకోబోయే నిర్ణయంపై అటు రైతులు,ఇటు కమిషన్ ఏజెంట్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే మార్కెట్‌లో దళారుల ఆగడాలు ఎక్కువయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో,ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అక్రమ వసూళ్లకు పాల్పడిన ఏజెంట్‌పై వేటు వేస్తేనే మిగతా ఏజెంట్లలో భయం ఏర్పడుతుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఏజెంట్ సమర్పించిన వివరణను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.



కమిటీ ఛైర్మన్ విధి, విధానాలు..

పాలకమండలి ఛైర్మన్ లైసెన్సు రద్దు సస్పెన్షన్ నియమం 52(1) సెక్షన్ 7(1) కింద కమిషన్ ఏజెంట్,వ్యాపారి లేదా ఇతర వ్యక్తికి ఇచ్చిన లైసెన్సును మార్కెట్ కమిటీ సమావేశంలో లేదా సర్కులేషన్ ద్వారా తీర్మానం చేసి,కనీసం నలుగురు సభ్యులకు తక్కువ కాకుండా ఆమోదిస్తే రద్దు చేయవచ్చు లేదా సస్పెండ్ చేయవచ్చు. కింది పేర్కొన్న కారణాలు కమిటీ సంతృప్తి చెందితే చర్యలు తీసుకుంటుంది:

1).(ఏ) తప్పుడు సమాచారం లేదా మోసం: ఉద్దేశపూర్వకంగా తప్పుడు వివరాలు ఇచ్చి లేదా మోసం చేసి లైసెన్సు పొందినట్లయితే.

2). (బి) నిబంధనల ఉల్లంఘన: లైసెన్సు పొందిన వ్యక్తి లేదా అతని తరపున (స్పష్టమైన లేదా సూచించిన అనుమతితో) పనిచేసే సిబ్బంది/మరెవరైనా లైసెన్సు నియమ నిబంధనలను,ఈ నియమాలను లేదా మార్కెట్ కమిటీ బై-లాస్‌ను ఉల్లంఘించినట్లయితే.

3).(సీ) వ్యాపారాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం:మార్కెట్ ప్రాంతంలో నోటిఫై చేసిన వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్‌ను ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవాలనే, నిలిపివేయాలనే లేదా ఆపాలనే ఉద్దేశంతో,ఇతర లైసెన్సుదారులతో కలిసి ఏదైనా చర్యకు పాల్పడినా లేదా సాధారణ వ్యాపారాన్ని చేయకుండా ఆగిపోయినా,తద్వారా ఆ మార్కెటింగ్‌కు ఆటంకం కలిగితే.

4).(డి) దివాలా తీయడం: లైసెన్సుదారు దివాలా తీసినట్లయితే.

5). (ఈ)చట్టం కింద నేరారోపణ:ఈ చట్టం కింద ఏదైనా నేరానికి లైసెన్సుదారు దోషిగా నిర్ధారించబడితే.2. నోటీసు ప్రక్రియ,చైర్మన్ తాత్కాలిక జారీ చేసే అధికారం ఉంది.

రూల్ (నియమం):52(2)

ముందుగా షోకాజ్ నోటీసు: లైసెన్సును రద్దు చేసే లేదా సస్పెండ్ చేసే ముందు, సంబంధిత వ్యక్తికి మార్కెట్ కమిటీ నోటీసు జారీ చేస్తుంది.నోటీసు అందిన 7 రోజుల్లోపు లైసెన్సును ఎందుకు రద్దు చేయకూడదో లేదా సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని కోరుతుంది;గడువు ముగిసేలోపు సమాధానం వస్తే దానిని పరిశీలిస్తుంది.

చైర్మన్ అధికారం: (నిబంధన):మార్కెట్ కమిటీ తుది ఆమోదం (తప్పును సరిదిద్దడం) పెండింగ్‌లో ఉన్న సమయంలో,లైసెన్సు పొందిన వ్యక్తి లైసెన్సును మార్కెట్ కమిటీ చైర్మన్ 7 రోజులకు మించకుండా తాత్కాలికంగా సస్పెండ్ చేయవచ్చు (జీవో: ఎంఎస్ నెంబర్:356, ఎఫ్,ఏ, తారీఖున 14-4-1976 చేర్చబడింది).

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీ మెంబర్ బిపేట రాజకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆదే విధంగా మండలంలో వివిధ దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ సంఘాల నాయకులు అధికార కాంగ్రెస్ పార్టీ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచుల పోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ నంది కిషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డిలు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులతో పాటు ప్రతి పౌరుడు ప్రాథమిక విధులను కూడా గుర్తెరిగి నడుచుకోవాలనిఅన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ప్రత్యేకమన్నారు. రాజ్యాంగ రూపకర్తలను గౌరవించుకోవడంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను స్మరించుకునే సందర్భమిదని తెలిపారు. పౌరుల్లో రాజ్యాంగ విలువలను పెంపొందించేందుకు 2015 నుంచి నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం గౌరవించుకో దం జరుగుతుందన్నారు.ప్రపంచంలోని అనేక దేశాలు పాలనాపరమైన సమస్యలు, సంక్షోభాలను ఎదుర్కొంటున్నప్పటికీ భారతదేశం రాజ్యాంగం నిర్దేశించిన మౌలిక సూత్రాలు, ప్రజాస్వామ్య విలువలతో ముందుకు సాగుతోందని అన్నారు. దేశమే మొదటి ప్రాధాన్యత (నేషన్ ఫస్ట్) అనే భావనతో ప్రతి ఒక్కరూ దేశం పట్ల దేశభక్తిని, రాజ్యాంగం పట్ల విశ్వసనీయతను కలిగి ఉండాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లామానటరింగ్ కమిటీ మెంబర్ బిపేట రాజ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ గౌస్ బాయి మాజీ ఏఏంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి డైరెక్టర్ ఇమామ్ బాయి,అబ్జల్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు పుల్లయ్యగారి తిరుపతి గౌడ్ , సంజీవ్ రెడ్డి, కస్తూరీ ప్రవీణ్ రెడ్డి,, రాజు, మొక్కల ప్రేమికుడు దుంపెన రమేష్ తదితరులు పాల్గొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలి

పిల్లలను చదివించాలి ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలి

బాల్య వివాహాల నివారణపై ఐడీఓసీలో పూజారులు, పాస్టర్లు, క్వాజీలకు అవగాహన కార్యక్రమం



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) బాల్య వివాహాల రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం బాల్య వివాహాల నివారణపై బాల్య వివాహం.. బతుకు ఆగం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె హాజరై ప్రారంభించారు. బాల్య వివాహాల నివారణపై అందరితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. బాల్య వివాహాలతో కలిగే ఆరోగ్య, ఇతర ఇబ్బందులపై వివరించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపల్లి చందన మాట్లాడుతూ పిల్లల హక్కుల సంరక్షణ కోసం ముందు ఉంటామని స్పష్టం చేశారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికారులు చైల్డ్ ఫ్రెండ్లీ అని కొనియాడారు. ప్రతి కుటుంబంలో వారి వారి మత పెద్దల పాత్ర ఎక్కువగా ఉంటుందని, లైంగిక వేధింపుల, బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లలందరినీ చదివించేలా ప్రోత్సహించాలని అన్నారు. ఏ వయసు వారికి వివాహం చేస్తున్నామో కచ్చితంగా తెలుసుకోవాలని స్పష్టం చేశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం 2006లో చట్టం చేసిందని తెలిపారు. బాల్య వివాహం చేసే అందరికీ చట్టం ప్రకారం జైలు, జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. సమాజంలో ప్రధాన మార్పులో అన్ని మతాల పెద్దలు కీలకమని తెలిపారు. కాన్పు కోసం ఎలాంటి డేట్లు చెప్పవద్దని సూచించారు. బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. ఏడాది కాలంలో 12 బాల్య వివాహాలు అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచిగా చదివి.. ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. బాలల దత్తత కూడా చట్ట ప్రకారం తీసుకోవాలని అన్నారు. ఎస్పీ మహేష్ బి గితె మాట్లాడుతూ బాల్య వివాహాల సమాచారం 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడైనా పెళ్లి సమాచారం తమకు వెంటనే ఇవ్వాలని తెలిపారు. అన్ని మతాలకు సంబంధించిన కార్యక్రమాల్లో బాల్య వివాహాల నివారణ, పిల్లల చదువు, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న దర్శనానికి వెళ్తే గదులకు అష్ట కష్టాలు

- దర్శన టికెట్లు ఉన్నా గదులు కేటాయించరా.? ఎందుకు ఇలా.?
- రెండు నిమిషాల్లో ఆన్‌లైన్ బుకింగ్ ముగింపు.. తెరవెనుక ఏజెంట్ల దందానా.?
- టికెట్లు దొరికాయని వృద్ధులు, పిల్లలతో వస్తే గదులు దొరకక రోడ్లపైనే పడుకుంటున్న భక్తులు
- టికెట్ల కేటాయించి గదులు కేటాయించక పోవడం విడ్డూరంగా మారిన టీటీడీ పాలన
- టీటీడీ విజిలెన్స్ నిఘా ఎక్కడ.? ఏజెంట్లతో అధికారుల కుమ్మక్కు ఆరోపణలు
- భక్తుల సహనాన్ని పరీక్షిస్తున్న పాలకమండలి అనాలోచిత నిర్ణయాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుంటేనే సమస్యకు పరిష్కారమా.?





తిరుమల(ప్రశ్న న్యూస్)కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలనే భక్తుల కోరికను టీటీడీ నిర్వహణలోని లోపాలు నీరుగారుస్తున్నాయా? స్వామివారి దర్శనం కోసం ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు కనీస వసతి కల్పించడంలో తిరుమల తిరుపతి దేవస్థానం పూర్తిగా విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్శన టికెట్లు చేతిలో ఉన్నా గదుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కుటుంబ సభ్యులు, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు వసతి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

రెండు నిమిషాల్లోనే ఆన్‌లైన్ బుకింగ్ ఖతం

టీటీడీ ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు, గదుల బుకింగ్ ప్రారంభించిన కొద్ది నిమిషాల్లోనే గదులన్నీ ఖాళీ అయినట్లు చూపిస్తుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేలాది మంది భక్తులు ప్రయత్నిస్తున్నా రెండు నిమిషాల్లోనే బుకింగ్ పూర్తవుతుండటం వెనుక అసలు మతలబు ఏమిటి.? సామాన్య భక్తులకు గదులు దొరకని పరిస్థితుల్లో మరి గదులు ఎవరికి కేటాయిస్తున్నారు.? ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత ఉందా.? సాంకేతిక లోపాలా, లేక తెరవెనుక అక్రమాలా.? టీటీడీ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. దర్శన టికెట్లు పొందిన వాళ్లకు కచ్చితంగా గదులు ఇచ్చే బాధ్యత కూడా టీటీడీ పాలకమండలి ఇదే మరి ఇలాంటి బాధ్యతను టీటీడీ పాలకమండలి అధికారులు ఎలా విస్మరిస్తున్నారో వాళ్ళ విజ్ఞతకే తెలియాలి. దర్శన టికెట్లు ఇచ్చి గదులు ఇవ్వకపోవడం ఏమిటని భక్తులు రోడ్లపై పడుకోమని చెప్పడమేనా వీళ్ళ ఉద్దేశం అన్న ఆగ్రహం భక్తుల నుండి వెలుబడుతుంది.

ఏజెంట్ల చేతుల్లో గదుల కేటాయింపులా.?

తిరుమలలో కొందరు ఏజెంట్లు భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకొని గదుల విషయంలో దందాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారికంగా గదులు దొరకని భక్తులకు బయట అధిక మొత్తాలు చెల్లిస్తే వసతి కల్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు రంగంలోకి దిగుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారాలపై టీటీడీ విజిలెన్స్ విభాగం కఠిన నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ, ఏజెంట్ల కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవడం పై విజిలెన్స్ విభాగం పై పలు అనుమానాలకు తావిస్తోంది. కొందరు విజిలెన్స్ అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల మధ్య కుమ్మక్కు ఉందన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరపాలి.

దర్శన టికెట్ ఉంటే రెండు రోజులు గది ఇవ్వలేరా.?

దర్శన టికెట్లు ఉన్న భక్తులకు కనీసం రెండు రోజుల పాటు గదులు కేటాయించే విధానాన్ని అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ప్రయాణ బడలికతో పాటు వసతి సమస్యలతో సతమతమవుతున్నారు. టీటీడీ వద్ద కోట్ల డబ్బు ఉండి కూడా తిరుమల కు వచ్చే భక్తులకు ఎందుకు వసతి గృహాలు పూర్తిస్థాయిలో నిర్మించడం లేదని ఒక రోజులో ఎంతమంది వస్తారో తెలుసు, ఎన్ని గదులు కావాలో తెలుసు, అయిన గదులు నిర్మించకపోవడం, నిర్మించిన వాటిని కేటాయించకపోవడం, గదుల అక్రమ కేటాయింపు దందాను ప్రోత్సహించడం భక్తులను దోచుకోవడం కాదా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. పాలకమండలి తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు భక్తులకు ఉపశమనం కల్పించకపోగా మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తి కేంద్రం.. అక్రమాలకు అడ్డా కావాలా.?

వెంకన్న సన్నిధిలో దర్శనం టికెట్లు, గదుల కేటాయింపుల పేరుతో సామాన్య భక్తులు దోపిడీకి గురవుతున్నారన్న విమర్శలు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరుమలలో పరిస్థితులు మెరుగుపడతాయని ఆశించిన భక్తులకు ఇప్పటికీ నిరాశే మిగులుతోందన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది.

సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాలి

టీటీడీ ఆన్‌లైన్ బుకింగ్ విధానంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, ఏజెంట్ల ముఠాలపై నిఘా పెంచాలని, విజిలెన్స్ విభాగం పనితీరును సమీక్షించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దర్శన టికెట్లు ఉన్నవారికి పారదర్శకంగా వసతి కల్పించే విధానం తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. సామాన్య భక్తుడికి స్వామివారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, టీటీడీ పాలకమండలిపై ఉంది. మరి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి భక్తుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతారా.? లేక వెంకన్న దర్శనానికి వచ్చే భక్తులకు గదుల గోస తప్పదా.? అన్నది వేచి చూడాలి.

పోలీస్ బాస్‌లకు జైలుశిక్ష

సి పి రమేష్ రెడ్డి, డిసిపి కోటిరెడ్డి లకు హైకోర్టు షాక్
ఇద్దరు బాస్ లకు రెండు వారాల జైలు
రూ. 2 వేల చొప్పున జరిమానా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇద్దరు పోలీసు బాసులకు జైలు శిక్ష పడింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతర్ చేసిన పోలీస్ బాసులపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. కోర్టు ధిక్కారణ కేసులో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి తో పాటు మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి కి రెండు వారాలపాటు జైలు శిక్ష, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ గురువారం తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసు బాస్ లకు జైలు శిక్ష పడడంతో రాష్ట్రంలో హాట్ టాపిక్ గా మారింది.

భూ వివాదమే పోలీసు భాషలకు జైలు శిక్ష

ఓ భూ వివాదానికి సంబంధించిన కేసులో పిటిషన్ కు తగిన పోలీసు రక్షణ కల్పించాలంటూ గతంలో తెలంగాణ హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డి, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి నిర్లక్ష్యం వహించారని పిటిషనర్ కోర్టులో దిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణ చేపట్టిన హైకోర్టు అధికారుల తీరును తప్పపడుతూ ఈ మెరకు కఠిన నిర్ణయం తీసుకుంది. అయితే సదరు పోలీసు అధికారులు ఈ తీర్పుపై హైకోర్టులో (డివిజన్ బెంచ్) ఆపిల్ చేసుకునేందుకు వీలుగా జె6 అమలును వారం రోజులపాటు తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ న్యాయస్థానం వెసులుబాటు కల్పించింది. వారం రోజుల్లోగా ఉన్నత న్యాయస్థానం నుండి స్టే ఉత్తర్వులు తీసుకురాని పక్షంలో హైకోర్టు రిజిస్టార్ ఎదుట లొంగిపోవాలని న్యాయస్థానం ఆదేశించింది.

చెట్టు పైన దిగిన విమానం



గోల్కొండ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతంలో క్యాడెట్, శిక్షకుడు ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 'సెస్నా 152' చిన్న విమానం అత్యవసర పరిస్థితుల్లో ఒక చెట్టుపైకి దిగింది (ఫోర్స్డ్ ల్యాండింగ్). ఈ ఘటనలో క్యాడెట్ తలకు గాయమవ్వగా, మరో ట్రైనర్ కు ప్రమాదం నుండి బయటపడ్డాడు. గాయపడ్డ క్యాడెట్ కు ఆర్మీ ఆసుపత్రిలో తరలించి చికిత్స చేశారు. ఈ ఘటనపై డీజీసీఏ విచారణ చేపట్టనుంది.

ప్రభుత్వ భూములపై కొరడా

ప్రజా ఆస్తులకు రక్షణ కరువైందా.? కబ్జాదారుల కన్ను పడితే అంతేనా.?



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తులు, అవి భవిష్యత్ తరాల అవసరాల కోసం కేటాయించిన విలువైన సంపద. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, రహదారులు, ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడాల్సిన భూములు ఇవి. కానీ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాల ఆరోపణలు రోజురోజుకూ ఆందోళన కలిగిస్తున్నాయి. విలువైన భూములపై కొందరి కన్ను పడటంతో ప్రభుత్వ ఆస్తుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.

హద్దులు చెరిగిపోతున్నాయా.?

ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డులు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి హద్దులు స్పష్టంగా లేకపోవడం కొన్ని సందర్భాల్లో వివాదాలకు దారితీస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని కొందరు భూములను ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట చిన్న స్థాయిలో ప్రారంభమయ్యే ఆక్రమణలు క్రమంగా విస్తరించి విలువైన ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు అవసరాలకు వినియోగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.?

ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత రెవెన్యూ శాఖతో పాటు సంబంధిత అధికారులపై ఉంది. భూముల రికార్డులను పరిశీలించడం, సర్వే నిర్వహించడం, హద్దులు నిర్ణయించడం, ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం అధికారుల విధి. అయితే ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తారా.? ముందస్తు పర్యవేక్షణ ఎందుకు ఉండకూడదనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆస్తులు.. ప్రజల హక్కులు..

ప్రభుత్వ భూములు కబ్జాకు గురైతే నష్టపోయేది కేవలం ప్రభుత్వం మాత్రమే కాదు.. భవిష్యత్తులో ఆ భూములపై ఆధారపడే సామాన్య ప్రజలు కూడా. నేడు ఒక ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైతే రేపు అక్కడ పాఠశాల నిర్మాణానికి, ఆసుపత్రికి, పార్కుకు స్థలం లేకుండా పోయే ప్రమాదం ఉంది. ప్రజా అవసరాల కోసం ఉండాల్సిన భూములు వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా





ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అక్రమ ఆక్రమణలకు పాల్పడినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాధ్యత నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించే అధికారుల వ్యవహారంపైనా సమీక్ష జరిపి కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజా ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఎవరిది.?

ప్రభుత్వ భూములను కాపాడటం ఒక్క రెవెన్యూ శాఖ బాధ్యత మాత్రమే కాదు. సంబంధిత శాఖలు, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజలు సైతం ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తిస్తే ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేయాలి. పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు ఎప్పుడు.?

భూ భారతి వంటి భూ రికార్డుల వ్యవస్థలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ భూముల వివరాలను సర్వే నంబర్ల వారీగా పరిశీలించాలి. ఆక్రమణకు గురైన భూములను గుర్తించి, వాటి హద్దులను నిర్ధారించి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లాలోని ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, ఎక్కడెక్కడ ఎంత భూమి ఉంది.? ఎంత భూమి ఆక్రమణకు గురైంది.? ఎక్కడ వివాదాలు ఉన్నాయి.? అనే వివరాలను



నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

- డిసెంబర్ 3 వరకు కొనసాగనున్న సభలు..
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) : పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలను తిరిగి ప్రారంభించాలని కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ప్రభుత్వ కార్యకలాపాల అవసరాలను బట్టి రెండు సభల సమావేశాలు డిసెంబర్ 3 వరకు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌లకు ప్రభుత్వం ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశాల్లో అవసరమైన ప్రభుత్వ కార్యకలాపాలను చేపట్టనున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ చట్టం అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏయే బిల్లులను ప్రవేశపెట్టనున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. 2023లో పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది. ఈ చట్టం అమలుకు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కీలకంగా మారాయి. నియోజకవర్గాల పునర్విభజనలో రాష్ట్రాల ప్రాతినిధ్యం, జనాభా నియంత్రణలో సాధించిన విజయాలు, సమాఖ్య వ్యవస్థ సమతుల్యత వంటి అంశాలు ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. ఈ అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ఆగస్టు 13న వాయిదా పడిన వర్షాకాల సమావేశాలు అధికారికంగా ముగియకపోవడంతో వాటినే తిరిగి కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కీలక అంశాలపై చర్చలు, నిర్ణయాలు వెలువడే అవకాశం ఉండటంతో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588